విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com



ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :71 నల్గొండ ఆదివారం 01-06-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ పేజీలు : 4 వెల : రూ.1/-


## గోవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు...



హైదరాబాద్,గోశాలల ఏర్పాటుకు సంబంధించి కమిటీని ఏర్పాటు చేయాలని, నిర్ణీత గడువులోగా కమిటీ పూర్తిస్థాయి ప్రణాళికతో రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో గోశాలల అభివృద్ధి, నిర్వహణ, సంరక్షణపై కమాండ్ కంట్రోల్ సెంటర్ లో అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్షించారు. గోసంరక్షణ, నిర్వహణ సులువుగా ఉండేందుకు వీలుగా గోశాలల ఏర్పాటు ఉండాలన్నారు. మొదటి దశలో వెటర్నరీ యూనివర్సిటీ, కళాశాలలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ, కళాశాలలు, దేవాలయాలకు సంబంధించిన భూముల్లో గోశాలలు ఏర్పాటు చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించాలన్నారు. కనీసం 50 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా గోశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇరుకు స్థలాల్లో బంధించినట్లుగా కాకుండా మేత మేసేందుకు, స్వేచ్ఛగా తిరిగేందుకు వీలుగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో గోశాలలు ఏర్పాటు చేసేందుకు పూర్తిస్థాయి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

ధార్మిక సంస్థలను భాగస్వాములు చేయాలి

గోశాల నిర్వహణ, పశువుల సంరక్షణలో ధార్మిక సంస్థలను భాగస్వాములను చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గోశాలల నిర్మాణం, నిర్వహణ, సంరక్షణకు సంబంధించి పూర్తిస్థాయి బడ్జెట్ అంచనాలతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎంకేపల్లిలో ఏర్పాటు చేయనున్న గోశాలకు సంబంధించి పలు డిజైన్లను ముఖ్యమంత్రి పరిశీలించారు. షెడ్ల నిర్మాణం, ఇతర డిజైన్లలో పలు మార్పులను సూచించారు. మరో నాలుగైదు రోజుల్లో తుది మోడల్ ను ప్రభుత్వం ఖరారు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎంఓ అధికారులు శేషాద్రి, శ్రీనివాసరాజు, మాణిక్ రాజ్, అజిత్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్, హెచ్ఎం ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, పశుపోషణ విభాగం డైరెక్టర్ బి.గోపి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ వీరత్వానికి చిహ్నంగా సింధూరం.. ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు



భోపాల్:ప్రధాని నరేంద్ర మోదీ శనివారం మధ్యప్రదేశ్ భోపాల్‌లో జరిగిన మహిళా శక్తీకరణ మహా సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 20 లక్షల మందికిపైగా మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన మోదీ ఆపరేషన్ సిందూర్, మహిళల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సింధూరం సంప్రదాయకంగా వివాహ బంధానికి చిహ్నమైనప్పటికీ, ఇప్పుడు అది నారీ శక్తి జాతీయ వీరత్వానికి చిహ్నంగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఆపరేషన్ సిందూర్?ను ఉదహరిస్తూ ఇది భారతీయ మహిళల ధైర్యం, శక్తి, సంకల్పాన్ని ప్రతిబింబిస్తోందని ఆయన చెప్పారు. మధ్యప్రదేశ్ భోపాల్‌లో శనివారం నిర్వహించిన మహిళా శక్తీకరణ మహా సమ్మేళనంలో ప్రధానమంత్రి పాల్గొన్నారు. దేవి అహల్యాబాయి హొల్కర్ 300వ జన్మదినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

పేదలకు సాయం..

దేవుని ఆరాధన, ప్రజల సేవకు దేవి అహల్యాబాయి ఎలాంటి భేదం చూపలేదని ప్రధాని మోదీ అన్నారు. ఆమె పేదల జీవితాల్లో పురోగతి కోసం అవిశ్రాంతంగా కృషి చేశారని చెప్పారు. కాశీలో సేవ చేసే అవకాశం నాకు లభించడం సంతోషకరమన్నారు. అక్కడే అహల్యాబాయి అభివృద్ధి పనులకు మొదట పునాది వేశారని మోదీ గుర్తు చేసుకున్నారు. ఆమె మహిళలను చేనేత రంగంలో శక్తివంతం చేశారని, నీటి సంరక్షణతో రైతులు ఎక్కువ ఆదాయం పొందేలా సహాయపడ్డారని వెల్లడించారు. స్త్రీలకు కూడా ఆస్తి హక్కులు ఉండాలని, భర్తలు అకాల మరణం చెందినా తిరిగి వివాహం చేసుకోవచ్చని అహల్యా ఆ కాలంలో చెప్పారని మోదీ అన్నారు.

అనేక కుటుంబాలకు

అహల్యాబాయి గిరిజన సమూహాల కోసం కూడా కృషి చేశారని, వారికి వ్యవసాయ భూములు కేటాయించి అభివృద్ధికి తోడ్పడ్డారని ప్రధాని అన్నారు. జూనాగఢ్ నుంచి కుటుంబాలను మహేశ్వర్‌కు తీసుకొచ్చి, మహేశ్వరీ చీరల తయారీలో నైపుణ్యం నేర్పించారన్నారు. ఇది ఇప్పటికీ అనేక కుటుంబాలకు ఆదాయ వనరుగా ఉందని మోదీ తెలిపారు. అహల్యాబాయి అభివృద్ధి, పురోగతికి చిహ్నమని.. ప్రజలు ఇచ్చిందే మనకు సొంతమని ఆమె చెప్పారని మోదీ ప్రస్తావించారు.

మహిళల కోసం..

ప్రస్తుత ప్రభుత్వం నీటి సరఫరా, గ్యాస్ కనెక్షన్, విద్యుత్ సరఫరా, వైద్య సంక్షేమ పథకాల ద్వారా సమాజ పురోగతి కోసం కృషి చేస్తోందన్నారు మోదీ. గతంలో మహిళలు తమ అనారోగ్యాలను దాచుకునేవారు. తమ కుటుంబంపై భారం కాకూడదని భావించేవారు. కానీ, ఇప్పుడు ఆయుష్మాన్ భారత్ యోజన ద్వారా ఐదు లక్షల రూపాయల వరకూ వైద్య సహాయం పొందుతున్నారని మోదీ చెప్పారు. మూడు కోట్ల మహిళలను లఖ్‌పతి దీదీలుగా చేస్తామని మేము వాగ్దానం చేశాం. ఇప్పుడు వేలాది మంది మహిళలు స్వయం సహాయక బృందాలతో అనుసంధానమై ఉన్నారు. భారతదేశం గొప్ప సంస్కృతి కలిగిన దేశం. మన సంప్రదాయంలో సింధూరం నారీ శక్తికి చిహ్నం. శ్రీరాముడిని ఆరాధించడానికి హనుమంతుడు కూడా సింధూరం ఉపయోగించాడని ప్రధాని మోదీ ప్రస్తావించారు.

## భగవంతుడు దయ చూపిస్తే పింఛన్ పెంచుతాం..



అమరావతి,ఈ ప్రభుత్వం పేదలు కోసం పని చేస్తుందని.. 64 లక్షలు మందికి ఒకటవ తేదీన పింఛన్ లు అందిస్తోందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. 34 వేలు కోట్లు రూపాయలు పింఛన్ డబ్బులు ఇప్పటి వరకు అందించామన్నారు. ముఖ్యమంత్రి తాజాగా మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎక్కడ ఈ స్థాయిలో పింఛన్లు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. భగవంతుడు దయ చూపిస్తే పింఛన్ పెంచుతామని తెలిపారు. గడిచిన ప్రభుత్వంలో భర్త చనిపోతే వితంతు పింఛన్ ఇవ్వలేదని విమర్శించారు. అన్ని రాష్ట్రాలు కంటే ఎక్కువ ఆదాయం ఉన్న మహారాష్ట్రలో పింఛన్ 1000 రూపాయలు మాత్రమే అందిస్తున్నారని చెప్పారు. తెలంగాణ లో పింఛన్ రూ. 2500 ఇస్తున్నారని సీఎం తెలిపారు.కోనసీమలో రైస్ ఎక్కువ పండుతుందని వాటినే తినడం వలన డయాబెటిస్ వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. 16347 పోస్ట్ లతో మెగా డీఎస్సీ నిర్వహిస్తున్నామని తెలిపారు.. గత ప్రభుత్వం రోడ్ల కి గుంతలు పెట్టి వెళ్ళిందని.. పవన్ కళ్యాణ్ అన్ని పంచాయతీ లకు ఒకే సారి నిధులు విడుదల చేశారని చెప్పారు. కేంద్రం ఇచ్చిన నిధులు డైవర్ట్ చేసి రాష్ట్రాన్ని బ్లాక్ లిస్ట్ లో పెట్టేలా గత ప్రభుత్వం చేసిందని ఆరోపించారు. టీటీడీలో అన్న దానం ప్రారంభించింది ఎన్టీఆర్ అని గుర్తు చేశారు. గడిచిన ప్రభుత్వంలో గంజాయి, డ్రగ్స్ విచ్చల విడిగా పెరిగి పోయిందని.. వాటిని అమ్మిన, కొన్న తాట తీస్తానని హెచ్చరించారు. ఏజెన్సీ లో గంజాయి పెంపకం మాములు అయిపోయిందన్నారు.. ఏపీలో సిబిఎన్ ఉన్నాడు.. మిగతా రాష్ట్రాలు కంటే డిఫరెంట్ గా ఉంటుంది.. పెట్టుబడులు పెట్టండని ఢిల్లీలో చెప్పానన్నారు. ఒక్కొక్క జంట 2.1 పిల్లలును కనాలని మరోసారి సూచించారు.. కానీ ఇప్పుడు 1.56కి పడిపోయారని తెలిపారు. 20 లక్షలు ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. నార్త్ ఇండియా కంటే సౌత్ ఇండియాలో జనాభా తగ్గిపోతుందని.. ఈ విషయం దృష్టిలో పెట్టుకోవాలన్నారు. 20 వేలు రూపాయలు మూడు విడతలుగా రైతులుకి అందిస్తామని శుభవార్త తెలిపారు.

## కొనసాగుతున్న రాజన్న కోడెల మృత్యుఘోష..



వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ గోశాలలో కోడెల మరణమృదంగం కొనసాగుతున్నది. అధికారుల నిర్లక్ష్యం, ప్రభుత్వ పట్టింపులేమి మూగ జీవాలకు శాపంగా మారింది. సరైన ఆవాసం, ఆహారం లేక తల్లడిల్లుతూ తనువు చాలిస్తున్నాయి. శుక్రవారం 8 కోడెలు మృతిచెందగా, శనివారం మరో 5 కోడెలు మృత్యువాతపడ్డాయి. దీంతో మృతిచెందిన మొక్కు కోడెల సంఖ్య 13కు చేరింది. కాగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాలతో గోశాలకు వచ్చిన వైద్య అధికారులు.. పశువైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. జీవాల మృతికి కారణాలను విశ్లేషించడంతోపాటు అనారోగ్యంగా ఉన్నవాటికి వైద్యం అందిస్తున్నారు. అయితే కొన్ని రోజులుగా రైతులకు కోడెల పంపిణీని అధికారులు నిలిపివేశారు. దీంతో గోశాలలో సామర్థ్యానికంటే కోడెలు ఎక్కువయ్యాయి.

పరిమితికి మించి కోడెలు.. అంతంతే మేత

రాజన్న భక్తులు కోరిన కోరెలు తీరితే స్వామివారికి నిజ కోడెను సమర్పించుకుంటామని మొకుకోవడం ఆనవాయితీ. ఈ క్రమంలో భక్తులు కోడెలను తీసుకువచ్చి రాజన్న ఆలయానికి అప్పగిస్తుండగా, వాటిని అధికారులు తిప్పాపూర్ గోశాలలో సంరక్షిస్తుంటారు. రాజన్న ఆలయానికి భక్తులు సమర్పించిన కోడెలను అవసరమైన రైతులకు కొన్నేండ్లుగా అందజేస్తూ వస్తున్నారు. ఆరు నెలల క్రితం కోడెల పంపిణీలో అవకతవకలు జరగడం, ఒకే వ్యక్తికి 60 జీవాలు అందించడం వివాదాస్పదం కావడంతో పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. ఈ క్రమంలో గోశాలకు భక్తులు సమర్పించే కోడెల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండగా, గోశాల ఇరుగ్గా మారిపోయింది.ఇక్కడ 400 నుంచి 500 కోడెలను సంరక్షించే స్థలం, అందుకు తగ్గట్టుగానే వసతులు ఉండగా, ప్రస్తుతం 1,250కిపైగా కోడెలు ఉన్నట్టు అధికారులు నిర్ధారించారు. పరిమితికి మించి రాజన్న కోడలు సంరక్షిస్తుండటంతో తరచూ తొక్కిసలాటలు జరుగుతున్నాయి. ఇటీవల వర్షాలతో గోశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతోపాటు, మోతాదుకు తగ్గట్టుగా పశుగ్రాసం అందకపోవడంతో నీరసించి మృతిచెందుతున్నట్టు వైద్యాధికారులు గుర్తించారు. నిత్యం 400 కోడెలకు మాత్రమే పచ్చి గడ్డిని అందిస్తున్నట్టు తెలుస్తుండగా, అధికారుల తీరుపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోశాలలో రోజూ పదుల సంఖ్యలో కోడెలు మృతి చెందుతున్నాయని ఆరోపిస్తున్నారు.

## ఆపరేషన్ సిందూర్ నష్టాలపై తొలిసారి స్పందించిన సీడీఎస్..



న్యూఢిల్లీ,ఆపరేషన్ సిందూర్ సమయంలో నష్టాల గురించి తొలిసారిగా చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్(సీడీఎస్) అనిల్ చౌహాన్ స్పందించారు. నాలుగు రోజుల సంఘర్షణ అణుయుద్ధం స్థాయికి చేరుకోలేని ఆయన చెప్పారు.భారత ఫైటర్ జెట్స్ కూలిపోయాయనే ఊహాగానాల నేపథ్యంలో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. " విషయం ఏంటంటే, జెట్ కూలిపోవడం కాదు, కానీ అవి ఎందుకు కూలిపోతున్నాయనేదే ముఖ్యం" అని ఆయన శనివారం సింగపూర్‌లో జరిగిన షాంగ్రి-లా డైలాగ్‌లో పాల్గొన్నప్పుడు బ్లూమ్‌బెర్గ్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. పాకిస్తాన్ ఆరు భారత యుద్ధ విమానాలను కూల్చివేసినట్లు పాకిస్తాన్ పేర్కొన్న వాదనలను పూర్తిగా తప్పు అని ఆయన చెప్పారు. అయితే, భారత్ ఎన్ని జెట్స్ కూలిపోయాయనే దానిపై మాట్లాడటానికి నిరాకరించారు. "అవి ఎందుకు కూలిపోయాయి, ఏ తప్పులు జరిగాయి, అవి ముఖ్యమైనవి, సంఖ్య ముఖ్యం కాదు" అని అన్నారు.ఇందులో మంచి విషయం ఏంటంటే, మనం చేసిన వ్యూహాత్మక తప్పిదాలను అర్థం చేసుకోగలుతున్నాము, సరిదిద్దుకోగలుగుతున్నాము. రెండు రోజుల తర్వాత దాన్ని సరిగ్గా అమలు చేయగలము. లాంగ్ రేంజ్ లక్ష్యంగా చేసుకుని మా అన్ని జెట్స్ ని మళ్లీ ఎగరవేయగలము" అని చౌహాన్ అన్నారు. ఈ నెల ప్రారంభంలో పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారత్ కి చెందిన ఆరు జెట్స్‌ని కూల్చేశామని పేర్కొన్నారు. అయితే, భారత ప్రభుత్వం దీనిపై వ్యాఖ్యానించడానికి దూరంగా ఉంది.అణు యుద్ధాన్ని నివారించడదానికి అమెరికా సహాయం చేసిందని డొనాల్డ్ ట్రంప్ చేసిన వాదనలపై అనిల్ చౌహాన్ వ్యాఖ్యానించలేదు. పాక్ మోహరించిన చైనా ఆయుధాలు భారత్ ముందు పనిచేయలేదని చెప్పారు. 300 కి.మీ దూరంలోని పాకిస్తాన్ వైమానిక స్థావరాన్ని అత్యంత ఖచ్చితత్వంతో కొట్టామని ఆయన వెల్లడించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు పాకిస్తాన్ భారత్ కన్నా అన్ని విషయాల్లో ముందున్నప్పటికీ, ఇప్పుడు అన్ని విషయాల్లో చాలా వెనకబడి ఉందని సీడీఎస్ చెప్పారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో స్వదేశీ తయారీ ఆకాష్ క్షిపణి వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా పనిచేసిందని ఆయన చెప్పారు.

## ఎస్సీ,ఎస్టీల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం....



పాల్వంచ : వెనుకబడిన వర్గాల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం భూ గరిష్ట పరిమితి చట్టం చేసిందని, భూమిలేని ఎస్సీ, ఎస్టీలకు భూములు పంపిణీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో 6.70 లక్షల ఎకరాలను పేదలకు పంపిణీ చేస్తే ఆ భూములను దున్నుకోకుండా అడ్డుకోవడమే కాకుండా మహిళలని చూడకుండా చెట్టుకు కట్టేసి బీఆర్ఎస్ దాష్టికాలకు పాల్పడిందని విమర్శించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో జరుగుతున్న తెలంగాణ కాంగ్రెస్ ఆదివాసి కార్యకర్తల సమ్మేళనంలో భ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఏఐసీసీ వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ , పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు హాజరైన ఈ కార్యక్రమంలో భట్టి మాట్లాడుతూ... గిరిజనుల కోసం ఇటీవలే ఇందిరాగాంధీ సౌర గిరిజల పథకాన్ని ప్రారంభించామని గుర్తు చేశారు. ఈ పథకానికి రూ. 12,500 కోట్లు కేటాయించామన్నారు.

ఎస్సీ , ఎస్టీ సబ్ ప్లాన్

2013లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని ఈ సబ్ ప్లాన్ కు రూ. 17,169 కోట్లు కేటాయిస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు గాలికి వదిలేసిందని డిప్యూటీ సిఎం మండిపడ్డారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు ఇవ్వలేదని ఉన్న నిధులు కూడా ఖర్చు చేయలేదని ధ్వజమెత్తారు.


ఆ వర్గాల సంక్షేమం కోసం ..

ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, ఈ వర్గాలకు రాజకీయ అధికారం కల్పించాలని కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉందని భట్టి అన్నారు. వెనుకబడిన వర్గాల వారు తలెత్తుకుని ఆత్మగౌరవంతో బతకాలనేది కాంగ్రెస్ లక్ష్యం అని ఈ వర్గాలను దృష్టిలో పెట్టుకునే దేశంలోని అన్ని రకాల వనరులను ఎస్సీ, ఎస్సీ, బీసీలకు ఇవ్వాలనేది కాంగ్రెస్ నిర్ణయించిందన్నారు. వెనుకబడిన వర్గాలను దృష్టిలో పెట్టుకునే కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షమ పథకాలను రూపొందిస్తోందన్నారు.

ప్రజల్లోకి తీసుకెళ్లండి..

కాంగ్రెస్ చేపట్టిన పథకాలను కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు భట్టి విక్రమార్క. దళితులు, గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసిన భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో హస్తగతం చేసుకున్నారన్నారు. చెప్పినట్లుగా తాము అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో వేసి భూభారతి తీసుకువచ్చామన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్ పై గత పదేళ్లు బీఆర్ఎస్ ఆలోచన చేయలేదన్నారు. కానీ తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను పక్కా భవనాలతో నిర్మించే కార్యక్రమం చేపట్టామని వివరించారు.

## బీఆర్ఎస్ బీజేపీలో కలిసే ప్రసక్తే లేదు..



హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో కలవబోతుంది అనే కొంతమంది వ్యక్తులు, కొన్ని రాజకీయ పార్టీలు చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో మధుసూదనాచారి మీడియాతో మాట్లాడారు.ఉమ్మడి ఏపీలో కాంగ్రెస్ వ్యతిరేకంగా టీడీపీ ఆవిర్భావం జరిగింది. ప్రతికూల పరిస్థితుల్లో కేసీఆర్ టీఆర్ఎస్‌ను స్థాపించారు. తెలంగాణ అంటే నక్సలైట్లు అన్న సందర్భంలో కేసీఆర్ పార్టీని పెట్టారు. కాంగ్రెస్, టీడీపీలకు ధీటుగా టీఆర్ఎస్ ఆవిర్భావం జరిగింది. ఇద్దరు బలమైన నాయకులు చంద్రబాబు, వైఎస్ఆర్‌ను కేసీఆర్ ఎదుర్కొన్నారు. తెలంగాణ సాధించి కేసీఆర్ సీఎం అయ్యి అభివృద్ధి చేశారు. బీఆర్ఎస్ పార్టీని బలహీనపర్చాలని కుట్రపూరితంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణ ప్రయోజనాలను కాపాడవని ఆయన స్పష్టం చేశారు.కేసీఆర్ సీఎంగా లేనందుకు ప్రజలు బాధపడుతున్నారు. కేసీఆర్ పాలన చర్చకు వస్తే కాంగ్రెస్, బీజేపీల రాజకీయ పునాదులు కదులుతాయి. పరిపాలనలో కాంగ్రెస్, బీజేపీ ప్రజల మెప్పు పొందాలి. కేంద్రమంత్రుల భాష, వారి పాలన ప్రజలు అసహ్యించుకునే విధంగా ఉంది. కేసీఆర్ నాయకత్వం పట్ల ప్రజలు సానుకూలంగా ఉన్నారు. జూన్ 2వ తేదీన తెలంగాణ భవన్‌లో ఆవిర్భావ వేడుకలు జరుగుతాయి.

### 2.10 లక్షల మంది ఇందిరమ్మ లబ్దిదారులు

హైదరాబాద్,ఇందిరమ్మ ఇళ్లకు ఇప్పటి వరకు 2.10లక్షల మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వచ్చే నెల 10లోగా మిగతా లబ్ధిదారుల జాబితా సిద్ధమవుతుందన్నారు. పైలట్ ప్రాజెక్టులో 42వేల ఇళ్లు మంజూరు చేయగా.. 24వేలు ప్రారంభమయ్యా యని, సుమారు వంద ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

## సంపాదకీయం

ఆదివారం 01-06-2025

# కంటి తుడుపు!


నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అన్నదాతలకు మళ్లీ అన్యాయం చేసింది. ఉత్పత్తి వ్యయంతో సంబంధం లేకుండా బుధవారం 14 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరలు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిపాదనలను, రైతు సంఘాల విజ్ఞప్తులను బుట్టదాఖలు చేసి, కంటితుడుపు తతంగంగా ధరల నిర్ణయం చేసింది. రైతులను ఆదుకోవడంలో తమ ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తుందని స్వీయభజన చేసుకునే బిజెపి దగాకోరుతనానికి కనీస మద్దతులో కొరవడ్డ చిత్తశుద్ధే ఒక ఉదాహరణ. ఏటేటా పెరుగుతున్న పెట్టుబడికి, మద్దతు ధరకీ లంగరు అందక తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్న రైతాంగం దాదాపు నాలుగు దశాబ్దాలుగా రక్షణ కోసం గావుకేక వేస్తోంది. 1995 2022 మధ్య దేశంలో 3 లక్షల 96 వేల 438 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. వ్యవసాయం బతుకు భరోసా ఇవ్వక ప్రతిరోజూ దేశంలో 33 మంది అన్నదాతలు ప్రాణాలు తీసుకుంటున్నట్టు లెక్కలు వక్కాణిస్తున్నాయి. రైతు కన్నీరు కార్చిన చోట అభివృద్ధికి, ఆధునికతకీ అర్థమే లేదని సామాజికవేత్తలు తరచూ ఉటంకిస్తారు. మరి ఏటా ఇంతమంది రైతులు ఉసురు తీసుకుంటున్నా- పాలకులు ఏం అభివృద్ధి సాధిస్తున్నట్టు? ఎవరి సంపద సృష్టికి అహర్నిశలూ పాటు పడుతున్నట్టు?వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి బయటపడ్డానికి 2006లో స్వామినాథన్ కమిషన్ కొన్ని విలువైన సూచనలు చేసింది. పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి (సి2 ౦ 50 శాతం) గిట్టుబాటు ధర కల్పించాలని సిఫార్సు చేసింది. పాలకులు దానిని పట్టించుకున్నదే లేదు. పదకొండేళ్ళుగా మోడీ ప్రభుత్వం కిసాన్ ఉద్ధరిణిగా గొప్పలు చెప్పుకుంటూ, ఆచరణలో తీవ్ర ద్రోహానికి పాల్పడుతోంది. ఈ ఏడాది వరి మద్దతు ధర కేవలం రూ.69 పెంచింది. సాగు వ్యయం చాంతాడులా పెరిగితే %-% అది అందించిన సాయం ఉంగరపు తాడంత కూడా లేదు. మొక్కజొన్న, కంది, మినుము, వేరుశనగ వంటి పంటలకు నిజమైన వృద్ధి రేటు ఒక శాతం కన్నా తక్కువగానే ఉంది. ఒక క్వింటా వరి ఉత్పత్తికి జాతీయ సగటు వ్యయం రూ.3135 కాగా, మోడీ ప్రభుత్వం ఇప్పుడు ఘనంగా ప్రకటించిన మద్దతు ధర రూ.2369. పత్తికి రూ.16 వేల మేర కనీస మద్దతు ధర ఉండాలని తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది ప్రతిపాదించింది. కేంద్రం తన మద్దతును రూ.7710కే పరిమితం చేసింది. రాగులు, జొన్న, నువ్వులు, కంది వంటి పంటలు విషయంలోనూ ఇదే దుస్థితి! మోడీ ప్రభుత్వ మద్దతు ధరల ప్రహసనం కేవలం కంటితుడుపునకే తప్ప రైతుల కష్టనష్టాలను, కన్నీరునూ అరికట్టటానికి కాదని అర్థమవుతోంది.కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణ పథకాన్ని కొనసాగించటం గురించి గొప్పగా చెబుతూనే- దీనివల్ల ఖజానాపై రూ.15 వేల 640 కోట్ల భారం పడుతుందని కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ వాపోయారు. కొన్ని లక్షల కోట్ల వ్యయప్రయాసలను నిత్యం మోస్తున్న రైతులను అందించే రుణ సహాయాన్ని 'భారం'గా భావించటంలోనే ఈ పాలకుల మొసలి కన్నీరు బయటపడుతుంది. కేంద్ర ప్రభుత్వం అరకొరగా అందిస్తున్న రూ.6 వేల పిఎం కిసాన్‌లో నమోదైన రైతుల సంఖ్య 9 కోట్ల 70 లక్షలు మాత్రమే! కార్పొరేట్లకు ఏటా లక్షల కోట్ల లబ్ధి చేకూర్చే మోడీ ప్రభుత్వం ఈపాటి సహాయానికే గొప్పలు చెప్పుకోవడం, పెనుభారం అన్నట్టు పెడ బొబ్బలు పెట్టడం విచిత్రంగా ఉంది.దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయరంగం కీలకమైన భూమిక వహిస్తోంది. కోట్లాది మంది రైతుల, వ్యవసాయ కార్మికుల, కౌలుదారుల అమూల్యమైన శ్రమ తగిన ప్రతిఫలం పొందకుండానే దేశంలోని అన్ని తరగతుల ప్రజలకు ఆహారంగా సమకూరుతోంది. వ్యవసాయం కార్పొరేటీకరణ చెందితే- మధ్య తరగతి ప్రజలు సైతం ఆహార ధాన్యాలను కొనుక్కోవటానికి పెద్దఎత్తున ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. భారతదేశపు లక్షలాది గ్రామాల్లో ఉన్న రైతులను, వ్యవసాయ కార్మికులను, వారంతా ఆధారపడే వ్యవసాయరంగాన్ని కాపాడుకోవడం దేశంలోని ప్రజలందరి కర్తవ్యం. అందుకోసం ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదించిన సిఫార్సులు అమలు చేయాలని రైతులూ, రైతు సంఘాలూ చాలా ఏళ్లుగా సాగిస్తున్న పోరాటంలో గొంతు కలపాలి. రైతుకు మద్దతు ఇవ్వడం అంటే దేశపు వెన్నెముకకు అండగా నిలబడడమే!

# మన కాలపు మహా రాక్షసుడు



న్యూఢిల్లీ,మనం ఒక మహా రాక్షసుని గురించి రెండవ ప్రపంచ యుద్ధ సందర్భంలో విన్నాము. తన గురించి చదవటం, వినటం, సినిమాలలో చూడటం తప్ప ఈ తరానికి ప్రత్యక్షంగా ఏమీ తెలియదు. ఆ రాక్షసుడు సుమారు 60 లక్షల మంది యూదులను, లక్షల మంది ఇతరులను నిలువునా ప్రాణాలు తీసాడు. ఆయన ప్రారంభించిన రెండవ ప్రపంచ యుద్ధంలో మొత్తంగా చనిపోయిన వారు, గాయపడిన వారు 5 కోట్లనుంచి 8 కోట్లకుపైగా ఉంటారని అంచనా. ఆ విధం గా మొత్తం మానవాళి చరిత్రలోనే అంతటి మారణహోమం ఎప్పుడూ జరగలేదు. మొదటి ప్రపంచ యుద్ధం సహా.ఇందులో ప్రస్తుత చర్చకు సంబంధించి యూదుల విషయం చెప్పుకోవాలి. వారిలో చిన్నా పెద్దా, మహిళలు, పిల్లలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ వెతికి మరీ చంపించాడు ఆ రాక్షసుడు. తమ దేశంలోనే గాక, తాము ఆక్రమించిన ప్రతి ఒక్క దేశంలో. మొత్తం యూదు జాతినంతటినీ అంతం చేయగలనని బాహాటంగా ప్రకటించాడు.ఆ రాక్షసుడు ఎవరో చాలామందికి అర్థమయే ఉంటుంది. తన పేరు అడాల్ఫ్ హిట్లర్. దేశం. ఆయన రాసిన తన ఆత్మకథ 'మీన్ కాంఫ్' (జర్మన్ భాషలో 'నా కథ'). దానిని కొందరు చదివే ఉంటారు. తనకు టీనేజ్ నుంచే యూదులు, సోషలిస్టులు, కమ్యూనిస్టులంటే పరమ ద్వేషం. రాజకీయ పార్టీ నెలకొల్పిన తర్వాత దానికి కార్యాచరణ రూపం వస్తుండగా, అధికారానికి వచ్చిన వెనుక ప్రత్యక్ష హత్యకాండ మొదలైంది.ఈ ప్రస్తావనలన్నీ ఎందుకంటే ఆ విధంగా హిట్లర్ విద్వేషానికి, మారణహోమానికి బలైన యూదుల వారసుడు అయిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ, హిట్లర్ జాతి విద్వేషానికి కూడా వారసత్వంగా తెచ్చుకుంటూ మనకాలపు మహా రాక్షసునిగా మారి, గత ఏడాదిన్నరగా 60 వేల మందికి పైగా పాలస్తీనా ప్రజలను కాల్చి చంపాడు.అందులో స్త్రీలు, పిల్లలు 80 శాతమని అంచనా. తక్కిన 20 శాతం మంది వృద్ధులు. ఇది గాక, పాలస్తీనాలోని రెండవ భూ భాగమైన వెస్ట్ బ్యాంక్‌లో కొన్ని వందల మంది ప్రాణాలు తీసారు. ఇదంతా నేటికీ కొనసాగుతోంది. ఇందులో భాగంగా లెక్కలేనన్ని ఆస్పత్రులు, పాఠశాల భవనాలు, ఇళ్లు, ఇతర నిర్మాణాలను కూల్చివేసి ఇంకా కూల్చుతున్నాడు. ప్రజలకు ఆహారం, నీరు, వైద్య సదుపాయాలు అందజేయటం లేదు. ఐక్యరాజ్య సమితితోపాటు ఇతర దేశాలు పంపుతున్న ఆహారం, మందులు గాజాకు చేరకుండా గత 80 రోజులుగా పూర్తి బ్లాక్ విధించింది. యావత్ ప్రపంచం ఎంత ఖండించినా లెక్కించటం లేదు. నెతన్యాహును మన కాలపు మహా రాక్షసుడని, హిట్లర్ వారసుడని అనటం అందుకే. దీనంతటి నేపథ్యపు చర్చలోకి వెళ్లే ముందు, ఇటీవలి వారం రోజుల పరిణామాల గురించి చెప్పుకోవాలి.నెతన్యాహూ చర్యలను ప్రపంచమంతా గతం నుంచి వ్యతిరేకిస్తూం డగా, ఇజ్రాయెల్‌కు గట్టి మద్దతుదారులైన అమెరికా, యూరప్‌లలోనూ పునరాలోచనలు మొదలయ్యాయి. ఆ పాపాలను ఇక మోయలేకపోతున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గత కొద్ది వారాలుగా నెతన్యాహూ పట్ల విముఖంగా కనిపిస్తున్న వార్తలు వెలువడుతున్నాయి. ఇటీవల పశ్చిమాసియా పర్యటనకు వెళ్లిన ఆయన ఇజ్రాయెల్‌ను మాత్రం దాటవేశారు. సెప్టెంబర్ 25 న మరొక అడుగు ముందుకు వెళ్లి, ఈ యుద్ధాన్ని ఇక ముగించాలని నెతన్యాహూను హెచ్చరిక. యూరోపియన్ దేశాల వైఖరి, నిజమో నటనలో గాని అంతకన్న కఠినంగా మారుతోంది. స్పెయిన్, నార్వే, ఐర్లాండ్‌లు ఇప్పటికే పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించడం, బ్రిటన్, ఫ్రాన్స్, కెనడాలు తాము కూడా గుర్తించే ఆలోచన ప్రకటించాయి. ఇదే విషయమై స్పెయిన్ చొరవ తీసుకుని 25వ యూరోపియన్, అరబ్ దేశాల సమావేశాన్ని నిర్వహించింది. ఇజ్రాయెల్‌తో వాణిజ్య చర్చలను బ్రిటన్తరంగా నిలిపివేసింది. అదే నిర్ణయం తామంతా తీసుకోవాలంటూ నెదర్లాండ్ ఏర్పాటు చేసిన సమావేశంలో, 27లో 17 యూరోపియన్ దేశాలు ఆ తీర్మానాన్ని బలపరచాయి. పాలస్తీనా గుర్తింపును జూన్‌లో సౌదీ అరేబియాతో చర్చ జరిగింది.యూరప్‌లో ఇజ్రాయెల్‌కు అన్నింటికన్న పెద్ద మద్దతుదారైన జర్మనీ సైతం నెతన్యాహూ ధోరణిని ఖండించింది.కానీ ఇవేమీ ప్రధాని లెక్కచేయని ఇజ్రాయెల్ ఒక్కరోజైనా ఆపకుండా గాజాపై దాడులు జరిపిస్తూ, ప్రతి రోజూ కొన్ని మంది ప్రాణాలు బలి తీసుకుంటున్నారు. , ఇటువంటి అమానుషం తగదంటున్నందుకు యూరోపియన్ నాయకులపై ఎదురు విమర్శలు సాగిస్తున్నాడు. వారు హమాస్ సమర్థకులని, ఆసంస్థ "దుర్మార్గాలను" సమర్థిస్తున్నారని నిందిస్తున్నాడు. అదే సమయంలో తన పథకం ఏమిటో దాపరికం లేకుండా ఉన్నాడు. దాని ప్రకారం, పాలస్తీనా దేశాన్ని ఎప్పటికీ ఏర్పడన్విడు. ఆ మాట తన జీవిత చరిత్రలో ఎప్పుడో రాసాడు. గాజాలోని 20 లక్షలకు పైగా ప్రజలందరినీ నిర్మూలిస్తాడు, లేదా ఇతర దేశాలకు వెళ్లగొడతాడు. ఆ ప్రాంతాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకున్నాడు. అక్కడ యూదులను సెటిల్ చేసారు. మరొకవైపు వెస్ట్ బ్యాంక్ అసలు పాలస్తీనాయే కాదని, ఇజ్రాయెల్‌లో భాగమని ఎప్పుడో ప్రకటించినందున, ఆ మేరకు అక్కడ వేలాదిగా యూదులను సెటిల్ చేయటం సంవత్సరాల క్రితమే మొదలైంది.ఆ చర్య అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని ఐక్యరాజ్య సమితితో పాటు పలు పాశ్చాత్య దేశాలు విమర్శించినా లెక్క చేయటం లేదు. అక్కడి పాలస్తీనియన్లపై యూదు సెటిలర్లు తమ సైన్యం సహాయంగా సాగిస్తున్న అత్యాచారాలు, హత్యలు, భూఆక్రమణలు నిత్యకృతమైపోయాయి. అక్కడ నామమాత్రంగా గల పాలస్తీనా అథారిటీ ప్రభుత్వంపై పూర్తి నియంత్రణ ఇజ్రాయెల్‌దే. అందుకే ఆ ప్రభుత్వం గజ దురంతాలపై అసలు నోరెత్తటం లేదు. తక్కిన ప్రపంచంతో పాటు ఇపుడు పాశ్చాత్య దేశాలు ఖండిస్తున్నా మాట్లాడటం లేదంటే, యాసిర్ అరాఫత్ వారసులుగా అధికారానికి వచ్చిన వారు కేవలం అధికారం, ధనార్జన కోసం ఎంతగా పతనమయారో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ ఒక కొత్త విశేషం కూడా కనిపిస్తోంది. ట్రంప్ అధ్యక్షుడైన తర్వాత ఇజ్రాయెల్‌ను సమర్థించే అమెరికా ప్రస్తుత యథాతథంగా కొనసాగిస్తూనే తన వ్యాపార ధోరణిలో కొత్త రంగు తెచ్చారు. అది, పాలస్తీనియన్లను గాజా నుంచి ఇతర దేశాలకు తరలించి అక్కడ అమెరికా ఆధ్వర్యంలో "అందమైన రిసార్ట్"ను అభివృద్ధి పరచగలమని. ఈ విషయం తెలిసింది.కానీ అరబ్ దేశాల నుంచి, తక్కిన ప్రపంచం నుంచి తీవ్ర విమర్శలు రావటంతో వెనుకకు తగ్గటం కూడా తెలిసిందే. ఇటీవల ఆయన మాట మాట్లాడటం లేదు. కానీ, తెర వెనుక నుంచి తన ఆమోదం ఉన్నదో లేక అదే ఆలోచనను తన అజెండా పైకి తెచ్చుకునో తెలియదు గాని, రిసార్ట్ మాటను నెతన్యాహూ గుర్తించాడు. గాజా ప్రజలను ఇతర దేశాలకు తరలించడానికి ట్రంప్ మొదట కొన్ని దేశాలతో సంప్రదించగా ఎవరూ అంగీకరించలేదు. అమెరికా అధ్యక్షుని ప్రయత్నాలే విఫలమైనపుడు ఇజ్రాయెల్ ప్రధాని సఫలంకాగల అవకాశం ఎంతమాత్రం ఉండదు. ఇది గ్రహించలేని వాడు కాదాయన. అయినా, ఒకవైపు హత్యకాండ సాగిస్తూ మరొక వైపు అందుకు భీతిల్లి గాజ ప్రజలు తమంత తాము ఇతర దేశాలకు పారిపోగలరని ఆశిస్తున్నారు. కానీ తాజాగా ట్రంప్ వైఖరిలో ఒక మేర మార్పు, యూరప్‌లో పెరుగుతున్న తీవ్ర వ్యతిరేకతతో ఏమి గమనించవలసి ఉంది. పాలస్తీనాకు సంబంధించి ప్రపంచమంతా మొదటి నుంచి గుర్తించి ఇపుడు యూరప్ కూడా క్రమంగా గుర్తిస్తున్న విషయం ఒకటుంది. అది, పాలస్తీనా, ఇజ్రాయెల్ అనే రెండు స్వతంత్ర దేశాల ఏర్పాటు, అందుకు ఇరువురి రాజీ మినహా సమస్యకు వేరే పరిష్కారం లేదు, ఎప్పటికీ ఉండబోదన్నది.ఈ సూత్రాన్ని అందరూ గుర్తించి వ్యవహరించినా ఈ సమస్య కొనసాగేది కాదు. కానీ ససేమిరా అంటూ వస్తున్నది ఇజ్రాయెల్. ఆ వైఖరికి మద్దతు ఇచ్చే పాశ్చాత్య దేశాలు, ఈ స్థితిని మన కాలపు మహా రాక్షసుడు తన చర్యల ద్వారా పరాకాష్ఠకు తీసుకు వెళుతున్నాడు. మిగిలిన ప్రపంచం ఐక్యరాజ్యసమితి ఎంత ఒత్తిడి చేసినా తన వైఖరి మారేది కాదు. అమెరికా సహా దేశాలు ఇటీవల మార్చుకుంటున్న తమ విధానాలను అదే విధంగా కొనసాగించడం, వాటిలో కొన్ని ప్రతిపాదిస్తున్నట్లు ఇజ్రాయెల్‌కు ఆయుధాలు, నిధుల సరఫరా నిలిపివేయడం, వాణిజ్య సంబంధాలను సస్పెండ్ చేయటం జరగడం తప్ప పరిస్థితి మారే అవకాశం లేదు. ఆ విధంగా వ్యవహరి ం చేటట్ల అరబ్ రాజ్యాలు ప్రపంచ దేశాలు పాశ్చాత్య ప్రభుత్వాలను ఒత్తిడి చేయాలి.

# 'బంగ్లా'లో యూనస్ ధ్వంస రచన



సెంట్రల్ డెస్క్:ఒక రంగంలో లబ్ధప్రతిష్ఠుడైనంత మాత్రాన వ్యక్తి అన్ని రంగాల్లోనూ విశేషంగా రాణించగలడని చెప్పలేం. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్‌ను ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అల్లర్లకు, రాజకీయ అస్థిరత్వానికి మారుపేరుగా నిలిచిన బంగ్లాదేశ్‌లో పుట్టిపెరిగిన యూనస్ మైక్రో ఫైనాన్స్ బ్యాంక్ ద్వారా సూక్ష్మరుణాలను అందజేసి లక్షలాది ప్రజలను పేదరికంనుంచివేసిన ఘనతను సొంతం చేసుకున్నారు. ఆయన కృషికి గాను సుమారు పాతికేళ్ల కిందట నోబెల్ శాంతి బహుమతి కూడా లభించిది. అయితేనేం, గత ఏడాది రిజర్వేషన్ల గలాభా కారణంగా షేక్ పదవి పోగొట్టుకుని, భారత్‌కు పరారై వచ్చిన తర్వాత ప్రభుత్వ తాత్కాలిక సారథిగా పగ్గాలు చేపట్టిన యూనస్, గత తొమ్మిది నెలలుగా పాలనను పట్టాలెక్కించలేక పడరాని పాట్లు పడుతున్నారు.మైక్రోఫైనాన్స్ బ్యాంకర్‌గా, ప్రొఫెసర్‌గా పేరొందిన ఈ పెద్దాయనకు పాలనానుభవం నాస్తి. రాజకీయానుభవం శూన్యం. ఫలితంగా ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు ఇంటాబయటా వివాదాలకు కారణమవుతున్నాయి. అవామీలీగ్ అధినేత షేక్ హసీనాతో ఆయనకు గతం నుంచి విభేదాలు వచ్చాయి. నోబెల్ సంస్థ యూనస్‌కు శాంతి బహుమతి ఇచ్చినా, పేదలను రుణాల ఊబిలోకి నెట్టివేశారంటూ ఆయనను హసీనా బహిరంగంగానే విమర్శించేవారు. దీనికితోడు కార్మిక చట్టాలను ఉల్లంఘించారంటూ బంగ్లాదేశ్ కోర్టు యూనస్‌కు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. కాకతాళీయంగా ఆ సమయంలో అధికారంలో ఉన్నది షేక్ హసీనాయే కావడం లేదు ఇద్దరికీ మరింత దూరం పెరగడానికి దోహదంచేసింది.ఈ పరిణామాల నేపథ్యంలో యూనస్ ముందుగా హసీనాపైనా, ఆమె పార్టీపైనా గురిపెట్టారు. హసీనా ప్రధాన అనుచరులను అరెస్ట్ చేయడంతో శాంతించకుండా ఏకంగా ఆమె పార్టీనే నిషేధించారు. పాకిస్తాన్‌లో బెంగాలీల స్వయం ప్రతిపత్తికోసం పోరాటం సల్పి, స్వతంత్ర బంగ్లాదేశ్ ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించిన, ఏడున్నర దశాబ్దాల చరిత్ర కలిగిన అవామీలీగ్‌పై ఉగ్రవాద వ్యతిరేక చట్టం కింద వేటు వేయడం సహజంగానే లక్షలాది పార్టీ కార్యకర్తల ఆగ్రహానికి కారణమైంది. పార్లమెంటు అనుమతి లేకుండా ఒక రాజకీయ పార్టీని ఎలా నిషేధిస్తారంటూ హసీనా ప్రశ్నించడంలో అర్థం లేకపోలేదు. మరోవైపు ఆమెకు ఆశ్రయం ఇచ్చిందన్న అక్కసుతో భారత్‌తో కోరి కయ్యానికి కాలు దువ్వుతున్నారు.స్వతంత్ర బంగ్లాదేశ్ ఆవిర్భావంలో భారత్ పోషించిన పాత్ర ఎటువంటిదో ఆ దేశంలో ఎవరిని అడిగినా చెబుతారు. కానీ యూనస్ ప్రభుత్వానికి ఇవేమీ పట్టడం లేదు.భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాలకు తామే దిక్కనే విధంగా చైనా గడ్డపైనుంచి ఆయన చేసిన ప్రకటన ఇరుదేశాల స్నేహ సంబంధాలను దెబ్బతీసింది. అంతటితో ఊరుకోకుండా ఇటీవల టగ్ బోట్ల నిర్మాణ భారత ప్రభుత్వ రంగ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని తెగతెం పులు చేసుకున్నారు. ఇందుకు ప్రతిగా బంగ్లాదేశ్ నుంచి పలు దిగుమతులపై భారత్ ఆంక్షలు విధించడంతో రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు కూడా బలహీనపడ్డాయి. తాను తాత్కాలిక సారథినేనన్న విషయానికి విస్మరించి, నియంత పోకడలు పోతున్న యూనస్ వైఖరిపై బంగ్లాదేశ్‌లో నిరసనలు పెల్లుబుకుతున్నాయి. సకాలంలో ఎన్నికలు నిర్వహించి, ప్రజాప్రభుత్వానికి పాలనా పగ్గాలు అప్పగించవలసిన యూనస్, ఉద్దేశపూర్వకంగా ఎన్నికలను వాయిదా వేస్తున్నారని ఆ దేశ సైన్యాధ్యక్షుడు బహిరంగంగానే నిరసన వ్యక్తం చేయడం.అయితే, అవసరమైతే వీధిపోరాటాలకైనా సిద్ధమే తప్ప, ముందుగా ఎన్నికల నిర్వహణ వీలు కాదని యూనస్ మొండికేస్తున్నారు.వచ్చే ఏడాది ఆగస్టులోగాని ఎన్నికల నిర్వహణ నిర్వహణ సాధ్యం కాదని తెగేసి చెబుతున్నారు. ప్రభుత్వానికి సహకరించిన అధికార యంత్రాంగం, సద్దుమనగని అల్లర్లు, పట్టాలెక్కని పాలన... యూనస్ తాత్కాలిక ప్రభుత్వాన్ని వధ్యశిలపై నిలబెడుతోంది. ఈ నేపథ్యంలో ఆయన రాజీనామా ఇటీవల పుకార్లు గుప్పుమనడంలో ఆశ్చర్యమేముంది? ఇవన్నీ నిజం కాదంటూ ప్రభుత్వం కొట్టిపారేసినా, ఎన్నికలు జరిగేంతవరకూ యూనస్ ప్రభుత్వం ఉంటుందా, ఊడుతుందా అనే సందేహం అందరిలోనూ ఉంది. ప్రపంచమంతా మెచ్చిన వ్యక్తికి అధికారం చేపట్టాక ఏమైంది? ఈ ప్రశ్న ఇప్పుడు బంగ్లాదేశ్‌లోని ప్రతి పౌరుడినీ వేధిస్తోంది. ఈ విషయంలో నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ ఆత్మావలోకనం చేయడం మంచిది.

# కాంగ్రెస్ సీనియర్ నేత సల్మాన్ ఖుర్షీద్

న్యూఢిల్లీ,జమ్మూ కశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ సల్మాన్ ఖుర్షీద్ స్వాగతించారు. ఆర్టికల్ 370 జమ్మూ కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పిస్తుందన్నారు. తద్వారా దేశంలోనే ఆ రాష్ట్రం ఉన్నా.. మిగిలిన ప్రాంతాలతో వేరుగా ఉన్నట్లు- ఒక భావన అయితే తమకు ఉండేదన్నారు. కానీ ఈ ఆర్టికల్ రద్దుతో ఆ భావన తమలో పూర్తిగా పోయిందని తెలిపారు. ఈ ఆర్టికల్ రద్దు అనంతరం ఆ రాష్ట్ర ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చిందన్నారు. ఆ క్రమంలో జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో 65 శాతం మేర పోలింగ్ నమోదయిందని గుర్తు చేశారు. దీంతో రాష్ట్రంలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఏర్పా-టైందని వివరించారు. ఇండినేషియాలో పర్యటనలో భాగంగా అక్కడి మేథావులు, విద్యా సంస్థల ప్రతినిధులతో విదేశీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలో ఉగ్రదాడి కారణంగా 26 మంది మరణించారు. ఈ దాడి వెనుక పాకిస్థాన్ హస్తం ఉందనే స్పష్టమైన సాక్ష్యాలను భారత్ సంపాదించింది. సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ చర్యలను ప్రపంచానికి చాటాలని భారత్ భావించింది. అందుకోసం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 7 బృందాలను కేంద్రం ఏర్పాటు- చేసింది. ఈ ఏడు బృందాలు వివిధ దేశాల్లో పర్యటిస్తూ.. ఆ యా దేశాల వేదికగా ఉగ్రవాదంపై పాక్ అనుసరిస్తున్న వైఖరిని ఎండగడుతున్నాయి. ఆ క్రమంలో జేడీ యూ ఎంపీ సంజయ్ కుమార్ ఝా నేతృత్వంలో ఓ ఎంపీల బృందం ఇండోనేషియా, మలేషియా, దక్షిణ కొరియా, జపాన్, సింగపూర్‌లో పర్యటిస్తుంది. ఈ బృందంలో కాంగ్రెస్ పార్టీ ఎంపీ సల్మాన్ ఖుర్షీద్ సభ్యుడిగా ఉన్నారు. 2019, ఆగస్టులో జమ్మూ కాశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370ని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన సంగతి తెలిసిందే. అయితే గతేడాది ఆగస్టులో జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో జత కట్టి బరిలో నిలిచిన నేషనల్ కాన్ఫరెన్స్‌కు ఆ రాష్ట్ర ఓటరు పట్టం కట్టాడు. దీంతో నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీలో ఈ ఆర్టికల్ 370ని పునరుద్ధరించాలంటూ ఒమర్ ప్రభుత్వం తీర్మానం చేసింది. ఈ తీర్మానంపై బీజేపీ మండిపడింది. మరోవైపు.. కాంగ్రెస్ పార్టీ ఎంపీ శశిథరూర్ ఇప్పటికే బీజేపీకి అనుకూలంగా వ్యాఖ్యలు చేయడమే కాకుండా.. ఆ పార్టీ ఎంపీలతో కలిసి సెల్ఫీలు దిగుతున్నారంటూ పార్టీ అధిష్టానం కాస్తా గుర్రుగా ఉంది. అలాంటి వేళ.. కాంగ్రెస్ పార్టీకి చెందిన మరో ఎంపీ సైతం ఆర్టికల్ 370 రద్దును స్వాగతించడం పట్ల ఆ పార్టీ అధిష్టానం ఆయనపై ఎలా వ్యవహరిస్తుందోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# కంటితుడుపు మద్దతు ధరలు

న్యూఢిల్లీ,వ్యవసాయ రంగం సంక్షోభం నుంచి బయటపడ్డానికి 2006లో స్వామినాథన్ కమిషన్ కొన్ని విలువైన సూచనలు చేసింది. పంట ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా కలిపి గిట్టుబాటు ధర కల్పించాలని సిఫార్సు చేసింది. పాలకులు దానిని పట్టించుకున్నదే లేదు. పదకొండేళ్ళుగా మోడీ ప్రభుత్వం రైతులను ఉద్ధరిస్తున్నామంటూ..గా గొప్పలు చెప్పుకుంటూ, ఆచరణలో తీవ్ర ద్రోహానికి పాల్పడుతోంది. ఈ ఏడాది వరి మద్దతు ధర కేవలం రూ.69 పెంచింది. సాగు వ్యయం చాంతాడులా పెరిగితే అది అందించిన సాయం లేషమాత్రమే. మొక్కజొన్న, కంది, మినుము, వేరుశనగ వంటి పంటలకు నిజమైన వృద్ధి రేటు- ఒక శాతం కన్నా తక్కువగానే ఉంది. ఒక క్వింటా వరి ఉత్పత్తికి జాతీయ సగటు- వ్యయం రూ.3135 కాగా, మోడీ ప్రభుత్వం ఇప్పుడు ఘనంగా ప్రకటించిన మద్దతు ధర రూ.2369. పత్తికి రూ.16 వేల మేర కనీస మద్దతు ధర ఉండాలని తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది ప్రతిపాదించింది. కేంద్రం తన మద్దతును రూ.7710కే పరిమితం చేసింది. రాగులు, జొన్న, నువ్వులు, కంది వంటి పంటల విషయంలోనూ ఇదే దుస్థితి! మోడీ ప్రభుత్వ మద్దతు ధరల ప్రహసనం కేవలం కంటితుడుపునకే తప్ప - రైతుల కష్టనష్టాలను, కన్నీరునూ అరికట్టటానికి కాదని అర్థమవుతోంది. దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయరంగం కీలకమైన భూమిక వహిస్తోంది. కోట్లాది మంది రైతుల, వ్యవసాయ కార్మికుల, కౌలుదారుల అమూల్యమైన శ్రమ తగిన ప్రతిఫలం పొందకుండానే దేశంలోని అన్ని తరగతుల ప్రజలకు ఆహారంగా సమకూరుతో వ్యవసాయం కార్పొరేటీకరణ చెందితే- మధ్య తరగతి ప్రజలు సైతం ఆహార ధాన్యాలను కొనుక్కోవటానికి పెద్దఎత్తున ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. భారతదేశపు లక్షలాది గ్రామాల్లో ఉన్న రైతులను, వ్యవసాయ కార్మికులను, వారంతా ఆధారపడే వ్యవసాయరంగాన్ని కాపాడుకోవడం దేశంలోని ప్రజలందరి కర్తవ్యం. అందుకోసం ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదించిన సిఫార్సులు అమలు చేయాలని రైతులూ, రైతు సంఘాలూ చాలా ఏళ్లుగా సాగిస్తున్న పోరాటంలో నిజాయితీపై చర్చించాలి. రైతుకు మద్దతు ఇవ్వడం అంటే దేశపు వెన్నెముకకు అండగా నిలబడడమేనని గుర్తించాలి. మద్దతు ధరల విషయంలో కేంద్ర ప్రభుత్వం అన్నదాతలకు మళ్లీ అన్యాయం చేసింది. ఉత్పత్తి వ్యయంతో సంబంధం లేకుండా బుధవారం 14 ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరలు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిపాదనలను, రైతు సంఘాల విజ్ఞప్తులను బుట్టదాఖలు చేసి, కంటితుడుపు తతంగంగా ధరల నిర్ణయం చేసింది. రైతులను ఆదుకోవడంలో తమ ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తుందని స్వీయభజన చేసుకునే బిజెపి దగాకోరుతనానికి కనీస మద్దతులో కొరవడ్డ చిత్తశుద్ధే ఒక ఉదాహరణ. ఏటేటా పెరుగుతున్న పెట్టు-బడికి, మద్దతు ధరకీ లంగరు అందక తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్న రైతాంగం దాదాపు నాలుగు దశాబ్దాలుగా రక్షణ కోసం గావుకేక వేస్తోంది. 1995 - 2022 మధ్య దేశంలో 3 లక్షల 96 వేల 438 మంది రైతులు ఆత్మహత్యకు పాల్పడ్డారని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. వ్యవసాయం బతుకు భరోసా ఇవ్వక ప్రతిరోజూ దేశంలో 33 మంది అన్నదాతలు ప్రాణాలు తీసుకుంటున్నట్టు లెక్కలు చెబుతున్నాయి. రైతు కన్నీరు కార్చిన చోట అభివృద్ధికి, ఆధునికతకీ అర్థమే లేదని సామాజికవేత్తలు తరచూ ఉటంకిస్తారు. మరి ఏటా ఇంతమంది రైతుల ఉసురు తీసుకుంటున్నా పాలకులు సీరియస్‌గా ఆలోచించడం లేదు.కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణ పథకాన్ని కొనసాగించటం గురించి గొప్పగా చెబుతూనే- దీనివల్ల ఖజానాపై రూ.15 వేల 640 కోట్ల భారం పడుతుందని కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ వాపోయారు. కొన్ని లక్షల కోట్ల వ్యయప్రయాసలను నిత్యం మోస్తున్న రైతులకు అందించే రుణ సహాయాన్ని 'భారం'గా భావించటం లోనే ఈ పాలకుల మొసలి కన్నీరు బయటపడుతుంది.

## ఏడాది లోపే ఎన్నో పనులు చేసి చూపాం

కడప,విశాఖ స్టీల్ ప్లాంట్, రైల్వే జోన్, పోలవరం, అమరావతి ఏడాదిలోపే సాధ్యం చేసి చూపామని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. కడపలో జరుగుతున్న మహానాడులో రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలు, బడుగు బలహీనవర్గాల కోసం పుట్టిన పార్టీ తెదేపా. ఎన్టీఆర్ పార్టీని స్థాపించి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. యువత, చదువుకునే వారిని ప్రోత్సహించారు. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' సహా ఏ మూల సిద్ధాంతాలతో ఎన్టీఆర్ పార్టీని స్థాపించారో.. ఆ విధానాలను సీఎం చంద్రబాబు ముందుకు నడిపిస్తున్నారు.

# చట్టం పోలీసుల చుట్టమా?

తెనాలి,తెనాలిలో ముగ్గురు యువకులను పోలీసులు నడిరోడ్డు మీద దారుణంగా కొట్టడంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. కానిస్టేబుల్‌ను కొట్టారు గనుక వారిని అందరి ముందూ కొట్టామని పోలీసు ఉన్నతాధికారులు కూడా చెప్పుకొచ్చారు. రౌడీషీటర్లను అరెస్టు చేయడం, వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం తప్పు కాదు. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంపైనా ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయరు. అలా చేయడానికి పోలీస్ స్టేషన్లు, విచారించి శిక్షలు వేయడానికి కోర్టులూ ఉన్నాయి. చట్ట ప్రకారం శిక్షించకుండా నేరుగా నడిరోడ్డుపై అదీ ఒకరు కాళ్లు నొక్కిపెడితే మరొకరు కొట్టడం. ఇది కచ్చితంగా చట్ట ఉల్లంఘన. మానవ హక్కుల హననం. అంటే పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నట్లు ప్రవర్తించారు.రాష్ట్ర విభజన అనంతరం అధికారంలోకి వచ్చిన టిడిపి, వైసిపి, ఇప్పుడు మరలా టిడిపి ప్రభుత్వం. అదే పోలీసులు, అదే పాలన. మరి ఇలాంటి రౌడీషీటర్లు ఎందుకు పుట్టుకొస్తున్నారు. యథేచ్ఛగా ఎందుకు తిరుగుతున్నారు. ఇవే కాదు. దోపిడీలు, దొంగతనాలు, నిరంతరం గంజాయి రవాణా ఇష్టారీతిగా సాగిపోతోంది. చిన్నారులపై అత్యాచారాలు, మహిళలు, విద్యార్థినులపై దాడులు జరుగు తున్నాయి. అంటే ఎక్కడో లోపం జరుగుతోంది. పెద్దపెద్ద దందాలు, సెటిల్‌మెంట్లు చేసేవారు పోలీసులతో కలిసే ఉంటున్నారు. మరి వారందరినీ ఇలాగే కొడుతున్నారా? తెనాలిలో కానిస్టేబుల్‌ను కొట్టారనే పేరుతో వారి జులుం ప్రదర్శించారు. ఒకవేళ వారిని శిక్షించాలి అనుకుంటే బహిరంగంగా కొట్టనవసరం లేదు.అంటే పోలీసులు వారి వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారనేది సుస్పష్టం. పైగా చట్టం వారికి కల్పించిన హక్కులను దుర్వినియోగం చేశారు. కోర్టులను, న్యాయవ్యవస్థను అపహాస్యం చేశారు. పేదలు, వెనుకబడిన కులాలకు చెందిన వారిని విచక్షణ రహితంగా కొట్టడం అంటే పోలీసులను అడిగేవారు ఎవరు లేరనే ధీమా అన్నా ఉండాలి.పోలీసులు ఇలా బహిరంగంగా శిక్షించేవారు, ఎక్కువగా రౌడీషీట్లు మోపే వారందరూ దళిత, మైనార్టీ, వెనుకబడిన తరగతులకు చెందిన వారే అధికంగా ఉంటారు.



ఇదొక సామాజిక సమస్య. దీని వెనుక ఒక పరిశోధనాత్మక అధ్యయనమే ఉంది. ఎన్‌కౌంటర్లకు గురయ్యేవారు, జైళ్లలో మగ్గేవారిలో ఎక్కువమంది ఎరుకల, దళిత ఇతర కులాలకు చెందినవారే ఉంటారు. ఇది చరిత్ర చెబుతున్న నిజం. వకుళాభరణం లలిత గారు రచించిన మాజీ 'నేరస్త' జాతులు–ఒక పరిశీలన అనే పుస్తకం చదివితే స్టువార్టుపురం, సీతానగరం వంటి చోట్ల సెటిల్‌మెంట్లు ఎందుకు ఏర్పాటయ్యాయో ఇట్టే అర్థమవుతుంది. ఇటీవల వచ్చిన 'జై భీమ్' సినిమాలోనూ తక్కువ కులం వాళ్లనే జైళ్లలో పెట్టడం, నేరాన్ని అంగీకరించాలని కొట్టి చంపడం వంటి చర్యలను మనం చూశాం. అలాగని గంజాయి అమ్మేవారిని, నేరస్తులను సమర్థించాల్సిన అవసరం లేదు. చట్టపరంగా శిక్షించాల్సిందే. పోలీసులు, వారిని నడిపే పాలకుల చుట్టంగా చట్టం ఉండకూడదనేది ఇక్కడ కీలకాంశం. కొన్ని పార్టీల నాయకులు అధికారంలో ఉన్నప్పుడు మాత్రం ఇలాంటి వాటిని సమర్థిస్తూ ఉంటారు. కులాలకూ అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటారు. దీంతో అసలు సమస్య పక్కకు పోయి ఒక రాజకీయ అంశంగా మారి చివరకు బాధితులకు న్యాయం జరగకపోగా వారే మరింత నేరాలకు పాల్పడిన వారుగా చిత్రీకరించబడతారు. తెనాలి ఘటనలో జరిగింది అదే.

## మరో పదేళ్లయినా కోలుకోకుండా దెబ్బతీసాం

శ్రీనగర్, పాక్‌పై ప్రతీకార దాడిలో భారత దళాల సామర్థ్యం అభినందనీయమని, మన సత్తా ఏమిటో చాటాని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. భారత్‌పై దాడిచేస్తే ధీటుగా సమాధానం ఇస్తామన్న ప్రధాని మోదీ ప్రకటన మేరకు పాక్‌కుమన దెబ్బను చూపామని అన్నారు. పాకిస్థాన్ దుశ్చర్యలను దీటుగా తిప్పికొట్టిన భారత సరిహద్దు భద్రతా దళాలపై అమిత్ షా ప్రశంసలు కురిపించారు. అలాగే కాశ్మీర్‌లో చేపట్టిన అభివృద్ధి కొనసాగుతుందన్నారు. దీనిని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. ఉగ్రదాడులతో ఆపాలనుకుంటే కఠినంగా జవాబిస్తామని హె÷÷చరించారు. ఇటీవల చేపట్టిన సైనిక ఆపరేషన్ సమయంలో పాక్‌లోని 118 పోస్టులను మన దళాలు ధ్వంసం చేశాయని అన్నారు. వారి సమాచార, నిఘా నెట్‌వర్క్‌ను కుప్పకూలివేశాయన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా జమ్మూ కశ్మీర్‌లో పర్యటించిన ఆయన.. బీఎస్ఎఫ్ కొట్టిన దెబ్బకు శత్రుదేశం కోలుకునేందుకు ఏళ్లు పట్టే అవకాశం ఉందన్నారు. ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా మనం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతిస్పందనగా పాకిస్థాన్ సైన్యం మన సరిహద్దుల్లోని పౌరులపై దాడులు చేసింది. వీటిని మన బీఎస్ఎఫ్ దళాలు దీటుగా తిప్పికొట్టాయి. దాదాపు 118 పాక్ పోస్టులను ధ్వంసం చేశాయి. శత్రువుల నిఘా వ్యవస్థను ఒక్కొక్కటిగా కూల్చివేశాయి. వాటిని పునరుద్ధరించేందుకు శత్రువులకు దాదాపు నాలుగు నుంచి ఐదేళ్లు పడుతుందని అమిత్ షా పేర్కొన్నారు. బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ నుంచి తనకు అందించిన సమాచారం ప్రకారం.. పాక్ సైనిక సమాచార, నిఘా వ్యవస్థలకు భారీ దెబ్బ తగిలిందన్నారు. కొంతకాలం పూర్తి సమాచార ఆధారిత యుద్ధాన్ని చేసే పరిస్థితిలో వారు లేరన్నారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ సంసిద్ధతపై అమిత్ షా ప్రశంసలు కురిపించారు. అప్రమత్తంగా ఉంటూ స్పష్టమైన వ్యూహాలను విజయవంతంగా అమలు చేశారని కొనియాడారు. భారత సరిహద్దుల్లో ఏటు-వంటి దాడులు జరిగినా మొదట ఆ భారాన్ని మోసేది బీఎస్ఎఫ్ జవాన్లేనని అన్నారు. జమ్మూ కశ్మీర్‌లో రెండు రోజుల పర్యటనలో భాగంగా.. ఇటీ-వల పాకిస్థాన్ జరిపిన దాడుల సందర్భంగా నష్టపోయిన కుటు-ంబాలను అమిత్ షా పరామర్శించారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న ఇళ్లు, వ్యాపార కేంద్రాలు, ప్రార్థనా మందిరాలకు సంబంధించిన పరిహార ప్యాకేజీని కేంద్రం త్వరలో ప్రకటిస్తుందన్నారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న పలు ప్రాంతాలను పరిశీలించిన ఆయన అక్కడి స్థానికులతో మాట్లాడారు.

## కూటమి అరాచక పాలనకు ఏడాది

అమరావతి,రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వ అరాచక, మోసపూరిత పాలనకు జూన్ 4కు ఏడాది అవుతుందని వైసీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణ రెడ్డి అన్నారు.. ఆ రోజు వైసిపి నిరసన దినంగా పిలుపునిచ్చిందని అన్నారు. అమరావతిలో మీడియాతో మాట్లాడుతూ..ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన చంద్రబాబు పాలనకు నిరసనగా జూన్ 4న వెన్నుపోటు దినం పాటించాలని వైసీపీ పిలుపునిచ్చినట్లు తెలిపారు. ప్రతీ జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు..ఏడాదిలో ఒక్కటంటే ఒక్క హామీ కూడా అమలు చేయలేదని విమర్శించారు. ప్రశ్నించే గొంతులు లేవకుండా భయోత్పాతాన్ని సృష్టించిన ప్రభుత్వం దేశ చరిత్రలోనే ఉండదన్నారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి ఏడాది లోనే 95 శాతం హామీలు అమలు చేశారని కొనియాడారు. ఏడాదిలో ఎంత విధ్వంసం చేయాలో చంద్రబాబు చూపించారని ఎద్దేవా చేశారు.. అధికారం చేతిలో ఉంటే ఎన్ని దాడులు చేయొచ్చనేది చేసి చూపించారన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చారు.. ఇప్పుడు పీ4 అంటున్నారని వైసీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణ రెడ్డి తెలిపారు. ఎవర్నో తీసుకువస్తాను.. మీరు మీరు చూసుకోండి అంటున్నారని.. ఈ మధ్య మరీ బరితెగించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు.. ఎవరూ ప్రశ్నించకుండా హింసాకాండ క్రియేట్ చేస్తున్నారన్నారు.. గతంలో మామకు వెన్నుపోటు– పొడిచారు.. ఇప్పుడు రాష్ట్ర ప్రజలందరికీ పొడుస్తున్నారని విమర్శించారు.. వెన్నుపోటుకు పేటెంట్ అంటే చంద్రబాబే గుర్తుకు వస్తారన్నారు.. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏడాది కాలంలో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు– పొడిచిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో జూన్ 4న పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన వెన్నుపోటుదినం పోస్టర్‌ను నేతలతో కలసి సజ్జల ఆవిష్కరించారు. చంద్రబాబు సీఎంగా తొలి ఏడాదిలోనే రూ.1.49 లక్షల కోట్లు అప్పులు చేశారు. ఆ సొమ్ము దేనికి వినియోగించారో తెలియదు. ఆనాడు మామకు వెన్నుపోటు– పొడిస్తే, ఈ రోజు నేరుగా తనను నమ్మి ఓటు– వేసిన ప్రజలకే పొడిచారు. దీనిని ప్రశ్నిస్తూ వైఎస్‌ఆర్‌సీపీ వెన్నుపోటు– దినంను నిర్వహిస్తోంది. నియోజకవర్గ స్థాయిలో పార్టీ శ్రేణులు ర్యాలీలుగా వెళ్ళి స్థానికంగా ఉన్న అధికారులకు మెమోరాండంలు సమర్పిస్తాయి. ఎన్నికల హామీలను అమలు చేయాలని, ఈ ఏడాది కాలంగా ప్రజలకు ఇస్తామన్న అన్ని పథకాల బకాయిలను తక్షణం విడుదల చేయాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో పాటు– మోసపోయిన ప్రజలు కూడా పాల్గొని, ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిస్తున్నామని సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు.

## ఆపరేషన్ కగార్ దుర్మార్గం

మంచిర్యాల,కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట దుశ్చర్యలకు పాల్పడుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. వారితో చర్చలు జరపకుండా మట్టుబెట్టే కార్యక్రమం చేపట్టిందని మండిపడ్డారు. శుక్రవారం మంచిర్యాలలో పర్యటించిన ఆమె మీడియాతో మాట్లాడారు. మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రెటరీ నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందితే కనీసం మానవత్వాన్ని చూపించకుండా, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా బీజేపీ సంస్కారాన్ని కోల్పోయిందని విమర్శించారు. కగార్‌ను ఆపాలని పదేపదే కోరినా స్పందించకుండా మారణకాండను కొనసాగించడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఇటీవల నిర్వహించిన సరస్వతి పుష్కరాల్లో స్థానిక ఎంపీ గడ్డం వంశీని ఆహ్వానించకపోవడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. గతంలో యాదగిరిగుట్టలో కూడా రేవంత్ రెడ్డి కుటుంబసభ్యులను ఆసనాలలో కూర్చుండబెట్టి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కింద ఆసనాలలో కూర్చోబెట్టి అవమానించారని దుయ్యబట్టారు. అనంతరం ఇటీవల మృతి చెందిన సీనియర్ జర్నలిస్టు మునీర్ కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు.

## నీతి ఆయోగ్ పాలక మండలి - రాష్ట్ర కూటమి ప్రభుత్వ తీరు



న్యూఢిల్లీ,నీతి ఆయోగ్ పదవ పాలకమండలి భేటీ ఈ నెల 24న జరిగింది. దేశ ప్రధాని అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి 24 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, 7 కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, ముఖ్యమంత్రులు హాజరుకాని రాష్ట్రాల నుంచి వారి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేకంగా 'వికసిత్ భారత్ 2047 కోసం వికసిత్ రాష్ట్రాలు' అనే అంశంపై ప్రత్యేక చర్చ జరిగింది. అయితే తమిళనాడు, కేరళ, పంజాబ్ తదితర రాష్ట్రాలలోని పాలక పార్టీల ప్రతినిధులు తమ రాష్ట్రాల ఎడల బిజెపి అనుసరిస్తున్న వివక్షతపై నిలదీశారు. రాష్ట్రాలు అభివృద్ధి కాకుండా 2047 నాటికి వికసిత భారత్ ఎలా సాధ్యమౌతుందని ప్రధానిని నిలేశారు. రాష్ట్రాలకిచ్చే కేంద్ర పన్నుల వాటాపై ప్రశ్నించారు. భారత్ వంటి సమాఖ్య ప్రజాస్వామ్యంలో చట్టబద్ధంగా రాష్ట్రాలకు ఇవ్వాల్సిన నిధులపై దేబిరించాల్సి రావటం, చివరికి పోరాటాలు, వ్యాజ్యాలకు దిగాల్సిన అనివార్య పరిస్థితులు కల్పించటం రాష్ట్రాలకే కాదు%ొ%దేశాభివృద్ధికి కూడా తీవ్ర విఘాతం ఏర్పడుతుందని విమర్శించారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన 41 శాతం పన్నుల వాటాను కూడా రాష్ట్రాలకు తిరిగి ఇవ్వడం లేదని, కేవలం 33.16 శాతం మేరకే ఇస్తున్నారని, రాష్ట్రాలను ఈ విధంగా అణగదొక్కటం దేశ సమాఖ్య వ్యవస్థకి పెను ప్రమాదమని తేల్చి చెప్పారు. కేంద్ర ప్రాయోజిత పథకాల్లో రాష్ట్రాల వాటాను భారీగా పెంచి కేంద్రం అదనపు భారం మోపుతున్నదని ఘాటుగా స్పందించారు. రాష్ట్రాల పట్ల వివక్షను వీడి కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు కనీసం 50 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు.సమావేశానికి హాజరైన ఎ.పి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇవేవీ ప్రస్తావించకుండా కేంద్ర బిజెపి వికసిత విజన్‌కు జేకొట్టారు. రాష్ట్రంలో స్వర్ణాంధ్ర ప్రదేశ్ విజన్ 2047 పేర కేంద్ర విధానాలను ఎలా అమలు చేస్తున్నదీ తెలిపేలా బ్లూప్రింట్ ప్రజెంట్ చేశారు. ప్రత్యేక హోదా గానీ, రాష్ట్ర విభజన చట్టంలో ఆంధ్ర రాష్ట్రానికి చెందిన ఇంకా అమలు కాకుండా ఉన్న అంశాలు గానీ, రెవిన్యూ లోటు భర్తీ, అమరావతి రాజధాని, పోలవరం నిర్మాణ నిధులు, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ఆగిపోయిన నిధులు/ప్యాకేజీ తదితర ఏ ఒక్క దానిని ప్రధాని ముందు ప్రస్తావించలేదు. రాష్ట్రంలో రైతాంగ పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా బర్లీ, కోకో వంటి అనేక వాణిజ్య పంటల ధరలు దారుణంగా పడిపోవడం, ఎన్నడూ లేనివిధంగా కంపెనీలు ఉత్పత్తులను కొనుగోలు చేయకపోవడం వంటి పరిస్థితులను కూడా ప్రధాని ముందుకు తీసుకెళ్లలేదు. కనీసం ఈ పంటలకు కేంద్రం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని కూడా డిమాండ్ చేయలేదు.రెండో వైపు రాష్ట్ర ప్రభుత్వం సరిపడ ఆదాయం లేక తీవ్ర నిధుల సమస్యను ఎదుర్కొంటున్నది. పరిమితికి దాటి అప్పులు సేకరిస్తూ రాష్ట్రాన్ని అప్పులమయం చేస్తున్నది. మూలధన పెట్టుబడులకు కోతలు పెడుతున్నది. అత్యవసర మౌలిక సదుపాయా లకు కూడా అవసరమైన నిధులు కేటాయించడం లేదు. ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలు ముఖ్యంగా సూపర్ సిక్స్ పథకాలు, యువగళం హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయకుండా దాటేస్తున్నది. రకరకాల పన్నులు పెంచి ప్రజల నుండి అధిక ఆదాయాన్ని రాబట్టే ప్రయత్నం చేస్తున్నది. ప్రజల ఆదాయాలను, కొనుగోలు శక్తిని దెబ్బతీస్తున్నది. ముఖ్యమంత్రి ఈ వాస్తవ పరిస్థితిని వివరించి, నిధులిచ్చి ఆదుకోవాల్సిన పరిస్థితిపై మోడీ ప్రభుత్వాన్ని నిలేసి ఉండాల్సింది.వీటిలో ఏ ఒక్క అంశాన్ని సమావేశంలో లేవనెత్తలేదు. రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిగా విస్మరించారు. కేంద్ర బిజెపికి లొంగి వుండటం ద్వారా కనీసం అదనపు అప్పులు, కొన్ని ప్రాజెక్టులనైనా పొందవచ్చనే తలంపుతో రాష్ట్రానికి చట్టబద్ధంగా రావాల్సిన వేల కోట్ల నిధులను వదిలేసి రాష్ట్ర ఆర్థిక ప్రయోజనాలను కేంద్ర మోడీ ప్రభుత్వానికి తాకట్టు పెట్టారు.పైపెచ్చు కేంద్ర ప్రభుత్వ నయా ఉదారవాద విధానాలను రాష్ట్రాల్లో అమలు చేసేందుకు మూడు ఉపసంఘాలను కేంద్రం నియమించాలని కోరారు. రాష్ట్రాలపై కేంద్రం పెత్తనాన్ని చంద్రబాబు మరింత బలపరుస్తున్నారు. ముఖ్యంగా వచ్చే 22 ఏళ్లలో 15 శాతం వార్షిక వృద్ధిరేటు సాధించి తలసరి ఆదాయం 42 వేల డాలర్లకు తీసుకెళ్లబోతున్నట్లు వెల్లడించారు. వికసిత్ భారత్ 2047కి ఆంధ్రప్రదేశ్ వాటా కింద 2.4 లక్షల కోట్ల డాలర్ల జిఎస్‌డిపి సమకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. వృద్ధి రేటు పెంపు ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ వ్యూహంగా ఉన్నది. ఇందుకోసం ప్రైవేట్ పెట్టుబడులను పెద్దఎత్తున ఆకర్షించాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. అలాగే పిపిపి విధానాన్ని అన్ని రంగాల్లో అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం వయబులిటి గ్యాప్ నిధులు అందించాలని కోరారు. అంటే రాష్ట్రంలో పెద్దఎత్తున ప్రైవేటీకరణ విధానాలు చేపట్టబోతున్నట్లు, సారవంతమైన భూములు, సుదీర్ఘమైన తీర ప్రాంతం, ఖనిజ, అటవీ సంపదను కార్పొరేట్ల దారాదత్తం చేయటానికి రాష్ట్ర కూటమి ప్రభుత్వం వేగంగా అనేక చర్యలు తీసుకోబోతున్నట్లు స్పష్టం అవుతున్నది. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న నయా ఉదారవాద విధానాల అమలుకు ఎ.పి ని దేశంలో ముందు భాగాన నిలబెట్టటమే రాష్ట్ర ప్రభుత్వ కర్తవ్యంగా కనిపిస్తోంది.వికసిత భారత్ 2047 కోసం వికసిత రాష్ట్రాల పేర నిర్వహించిన నీతి ఆయోగ్ భేటీ ముఖ్య లక్ష్యం%ొ% కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానా లను అన్ని రాష్ట్రాల్లో వేగంగా అమలు చేయడమే. వీటి అమలుకు కేంద్ర రాష్ట్రాలు కలిసి టీమ్ ఇండియాలా పని చేయాలని ప్రధాని ఉపదేశించారు. అంతేగాక ఈ సంస్కరణలను రాష్ట్రాల నుండి నగరాలు, నగరపాలక సంస్థలు, జిల్లాలు, గ్రామ స్థాయి వరకు అమలుచేయాలని అప్పుడే అవి అభివృద్ధి చెంది వికసిత్ భారత్‌లో భాగస్వామ్యం కాగలవని పేర్కొన్నారు. అంటే ఈ సంస్కరణలు గ్రామ స్థాయి వరకు వేగంగా అమలు చేయాలనేది కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.అంతర్జాతీయ పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను భారత్‌కు తరలించటానికి సిద్ధంగా ఉన్నారని అందుకు రాష్ట్రాలు కాలం చెల్లిన చట్టాలను, పెట్టుబడులకు ఆటంకంగా ఉన్న నిబంధనలను, నియంత్రణలను రద్దు చేసి పెట్టుబడి దారులతో స్నేహపూర్వక వాతావరణం కలిగి వారికి రెడ్ కార్పెట్ పర్చాలని రాష్ట్రాలను ప్రధాని కోరారు. భూ చట్టాలను ఇంకా సరళతరం చేయడం, వ్యవసాయ రంగంలో ప్రవేశానికి కార్పొరేట్ శక్తులకు స్వేచ్ఛ కల్పించడం, విద్య, వైద్య రంగాలను మరింత సరళతరం చేయడానికి రాష్ట్రాలు పూనుకోవాలని ఆదేశించారు.ఈ సంస్కరణలను బలవంతంగా అన్ని రాష్ట్రాల్లో అమలు చేయించటానికి కేంద్ర బిజెపి సిద్ధమైంది. అమలు చేయని ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలపై మరింత వివక్ష, ఆర్థికంగా అణిచివేత చర్యలకు పాల్పడబోతున్నది. ఆర్థిక సంఘం నిధుల్లో కోతలు, కేంద్ర ప్రాయోజిత పథకాల్లో వివక్షత, అప్పుల సేకరణపై ఆంక్షలు, పరిమితిపై కుదింపు, కేంద్ర అభివృద్ధి ప్రాజెక్టులు కేటాయింపు నిరాకరణ, మొత్తం రాష్ట్రాల ఆర్థిక కార్యకలాపాల దిగ్బంధం వంటి క్రూరమైన చర్యలకు కేంద్రం మరింత తెగబడే అవకాశం ఉంది.స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత కేంద్రీకృత పద్ధతిలో రాష్ట్రాల ఆర్థిక వనరులపై వ్యవహరించిన ప్రభుత్వం మరొకటి లేదు. ఒకవైపు ప్రలోభాలు పెడుతూ మరొకవైపు రాష్ట్రాలను భయపెడుతూ, వివక్షతా దాడులు చేస్తూ లొంగదీసుకుంటూ ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నది. ఫెడరలిజం అంటే కేవలం దేశంలో ఒక పరిపాలనా విధానం మాత్రమే కాదు. ఇందులో జాతీయ స్ఫూర్తి, చైతన్యం సమ్మిళితమై ఉంటుంది. భారతీయులమనే భావనతో పాటు ప్రతి రాష్ట్ర పౌరుడు పలానా రాష్ట్రానికి చెందిన వాడినని గర్వంగా చెప్పుకుంటారు. ఈ రెండు భావాల మధ్య ఎప్పుడూ ఘర్షణ రాకూడదు. రెండింటి మధ్య సమ భావన ఉండాలి. కానీ నేడు కేంద్ర బిజెపి ప్రభుత్వం ఫెడరల్ వ్యవస్థపై దాడి చేస్తూ ప్రజల్లో ఉన్న జాతి చైతన్యాన్ని దెబ్బతీస్తున్నది.కేంద్రం అనుసరిస్తున్న ఈ నిరంకుశ చర్యలకు వ్యతిరేకంగా దేశంలో అనేక ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు నిరసనలు, ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. నీతి ఆయోగ్ భేటీలో కూడా అనేక రాష్ట్రాలకు చెందిన ముఖ్యమంత్రులు, ప్రతినిధులు మోడీ ప్రభుత్వాన్ని నిలదీశారు. కానీ మన రాష్ట్ర ముఖ్యమంత్రి, కూటమి నేత చంద్రబాబు నాయుడు స్పందించక పోగా కనీసం వారికి మద్దతు కూడా ఇవ్వలేదు. మోడీ విధానాలకు పూర్తిగా గులామ్‌గిరి చేశారు. మోడీ మెప్పు కోసం తెగ ఆరాటపడ్డారు. చంద్రబాబు వ్యవహరించిన తీరు, ప్రవేశ పెట్టిన రాష్ట్ర ఆర్థిక విజన్ ఎ.పి ప్రయోజనాలను, హక్కులను తీవ్రంగా దెబ్బ తీస్తున్నది. కార్పొరేట్ శక్తులకు రాష్ట్ర సహజ వనరులను అప్పనంగా ధాంత్తం చేస్తున్నది. ముఖ్యంగా కార్మికరంగంలో అమలుకు పూనుకున్న లేబర్ కోడ్లు రాష్ట్రంలోని కార్మిక వర్గానికి శరాఘాతంగా మారనున్నాయి. 'పి 4' పేర పేదరిక నిర్మూలన బాధ్యత నుండి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైదొలగి సంపన్నులు, మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు వదిలేస్తున్నది.గత వైసిపి ప్రభుత్వం కూడా మోడీ చుట్టూ ప్రదక్షిణలు చేసి రాష్ట్ర ప్రయోజనాలను ఫణంగా పెట్టింది. పైపెచ్చు కేంద్ర బిజెపి విధానాలను నిస్సిగ్గుగా బలపరిచింది. ఇంతకన్నా దారుణంగా టిడిపి కూటమి లొంగుబాటు ప్రదర్శిస్తున్నది. ఈ ధోరణి రాష్ట్ర ఆర్థిక, రాజకీయ, ప్రజల ప్రయోజనాలకు పెను ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నది. మోడీ–బాబు కూటమి ద్వయం అమలు చేస్తున్న కార్పొరేట్ విధానాలను ఐక్యంగా తిప్పికొడితేనే రాష్ట్రానికి, ప్రజలకు భవిష్యత్తు.

## ఉగ్రవాదులు మరణిస్తే సంతాపమా?

న్యూఢిల్లీ,ఉగ్రవాద దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన భారత పౌరుల పట్ల కనీస సానుభూతి వ్యక్తం చేయకపోగా.. భారత్ దాడుల తర్వాత పాక్‌లో చనిపోయినవారికి మాత్రమే సంతాపం తెలిపిన కొలంబియా ప్రభుత్వ వైఖరి తీవ్రంగా నిరాశపరిచిందని భారత ప్రతినిధి శశిథరూర్ వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్‌కు దారితీసిన పరిస్థితులు, భారత్ తీసుకున్న చర్యలను కొలంబియా అధికారులకు వివరించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు శశిథరూర్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొలంబియా ప్రభుత్వం సంతాపం తెలపడంపై కాంగ్రెస్ నాయకుడు శశిథరూర్ అసహనం వ్యక్తం చేశారు. ఉగ్రవాదంపై పాకిస్థాన్ అనుసరిస్తున్న విధానాన్ని ఎండగట్టేందుకు భారత పార్లమెంటరీ అఖిలపక్ష ప్రతినిధి బృందాలు పలు దేశాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. అందులో శశిథరూర్ నాయకత్వంలోని బృందం ప్రస్తుతం కొలంబియాకు వెళ్లింది. ఈక్రమంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాద దాడుల బాధితులపై సానుభూతి వ్యక్తపరచకుండా.. భారత్ దాడుల తర్వాత పాక్‌లో ప్రాణాలు కోల్పోయిన వారికి కొలంబియా ప్రభుత్వం సంతాపం తెలపడం మమ్మల్ని నిరాశ పరిచింది. మా ఆత్మరక్షణ హక్కును మాత్రమే మేము వినియోగించుకున్నాం. ఆపరేషన్ సిందూర్‌కు దారితీసిన పరిస్థితులను గురించి కొలంబియా అధికారులతో వివరంగా మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈ దేశం కూడా అనేక ఉగ్రదాడులను చూసింది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా భారత్ అనేక దాడులను భరించింది. పాకిస్థాన్ తన సైనిక పరికరాలను వారి రక్షణ కోసం కాకుండా.. పక్క దేశాలపై దాడి కోసం వినియోగిస్తోంది. ఉగ్రదాడికి వ్యతిరేకంగా మాత్రమే మా విధానాలు ఉంటాయఅని థరూర్ పేర్కొన్నారు. పహల్గాం దాడి వెనక పాక్ ప్రాయోజిత ఉగ్రవాదం ఉందనడానికి భారత్ వద్ద కచ్చితమైన ఆధారాలున్నాయని థరూర్ వెల్లడించారు. ఈసందర్భంగా పాక్‌లోని మొత్తం రక్షణ పరికరాల్లో 81శాతం చైనా నుంచి అందుతున్నవేనని తెలిపారు. పాక్ తన సైనిక పరికరాలను రక్షణ కోసం కాకుండా.. పక్క దేశాలపై దాడి చేసేందుకు వినియోగిస్తోందని మండిపడ్డారు. ఉగ్రదాడికి వ్యతిరేకంగా మాత్రమే భారత్ విధానాలు ఉంటాయని ఈ సందర్భంగా శశిథరూర్ స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని తాము అంతర్జాతీయ వేదికలపై కూడా ప్రస్తావించనున్నట్లు– థరూర్ వెల్లడించారు. పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదంపై తాము జరుపుతున్న పోరు గురించి ప్రపంచ దేశాలకు వివరించేందుకు భారత్ మొత్తం ఏడు అఖిలపక్ష దౌత్య బృందాలను ఏర్పాటు చేసిన విషయం విదితమే. భారత పార్లమెంట్ అఖిలపక్ష ప్రతినిధి బృందాలు వివిధ దేశాల్లో పర్యటిస్తున్నాయి. ఇందులో భాగంగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ నేతృత్వంలోని బృందం ప్రస్తుతం కొలంబియాలో పర్యటిస్తోంది. ఈ సందర్భంగా థరూర్ అక్కడ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కొలంబియా ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

## కడప మహానాడు అద్భుత విజయం

అమరావతి,కడప మహానాడు అద్భుతంగా జరిగిందని.. జిల్లా నాయకత్వమంతా కలిసి పనిచేసి విజయవంతం చేశారని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. సక్సెస్ చేసిన నేతలకు అభినందనలు... కార్యకర్తలకు హ్యాట్సాఫ్ అని అభినందించారు. నాయకత్వం సమిష్టిగా పనిచేస్తే ఏ కార్యక్రమమైనా సజావుగా జరుగుతుందని కడప మహానాడుతో నిరూపితమైందన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్యనేతలు, గ్రామస్థాయి నాయకులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మంత్రులంతా కార్యకర్తల్లా పనిచేసి స్ఫూర్తినిచ్చారని కొనియాడారు. మహానాడుకు ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రావడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. మహానాడులో ప్రవేశపెట్టిన 'నా తెలుగు కుటుంబం'లోని ఆరు శాసనాల కాన్సెప్ట్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేస్తున్నామన్నారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేపట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాలనా నిర్ణయాలపై ప్రజల్లో సానుకూలత ఉందని తెలిపారు. ప్రజలకు ఏడాది పాలనలో ఏం చేశామో... రాబోయే రోజుల్లో ఏం చేస్తామో మహానాడు ద్వారా వివరించామన్నారు. ప్రజలతో నాయకులు మరింత మమేకమవ్వడం ద్వారా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై నిరంతరం చర్చించేలా చూడాలని సూచనలు చేశారు.తాను ప్రతి నెలా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడానికి కారణం కూడా అదే అని చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యేలు కూడా విధిగా పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించారు. జూన్ నెలలోనే తల్లికి వందనం, అన్నదాత పథకాలు ప్రారంభిస్తామని... ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించబోతున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందేలా సంక్షేమ కేలండర్‌ను త్వరలోనే ప్రకటిస్తామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. మరోవైపు కోనసీమ జిల్లాలో శనివారం సీఎం చంద్రబాబు పర్యటన సందర్భంగా ముమ్మరంగా ఏర్పాట్లు జరుగు తున్నాయి. శనివారం మధ్యాహ్నం గంటలకు ముమ్మిడివరం మండలం సి.హెచ్.గున్నేపల్లి గ్రామంలో ఏర్పాటు– చేసిన హెలిపాడ్‌లో సీఎం దిగనున్నారు. అక్కడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1:05 గంటలకు కాట్రేనికోన మండలం చెయ్యేరులో ఉపాధి హామీ పథకంలో పూడికతీత తీసే ఉపాధి కూలీలతో మాటామంతి నిర్వహిస్తారు. అనంతరం అక్కడే ఏర్పాటు– చేసిన కార్యక్రమంలో పలువురు అర్హులకు పింఛన్ పంపిణీ చేయనున్నారు. అదే గ్రామంలో ఏర్పాటు– చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో గ్రామస్తులతో సమావేశం కానున్నారు. అక్కడే జిల్లాకు సంబంధించి పేదల సేవలో బంగారు కుటుంబ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టనున్నారు. అనంతరం సీహెచ్ గున్నేపల్లి గ్రామంలో 3:35 గంలకు నియోజకవర్గం లోని టీ–డీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశంలో పాల్గొననున్నారు. 5:15 గంటలకు గున్నేపల్లి హెలిప్యాడ్ నుంచి తిరిగి ప్రయాణం కానున్నారు. జిల్లాలో సుమారు ఐదు గంటల పాటు– సీఎం పర్యటన జరగనుంది.

## నేవీ రంగంలోకి దిగివుంటే పాక్ ముక్కలయ్యేది

న్యూఢిల్లీ, పాకిస్థాన్‌కు భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాస్ వార్నింగ్ ఇచ్చారు. పాకిస్థాన్‌తో యుద్ధం జరిగినప్పుడు భారత నేవీ కనుక రంగలోకి దిగి ఉంటే.. పాకిస్థాన్ నాలుగు ముక్కలై ఉండేదని అన్నారు. యుద్ధం సమయంలో భారత నేవీ మౌనంగా ఉంటూనే.. శత్రువుల గుండెల్లో దడ పుట్టించిందని అన్నారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా నేవీ పాత్రను ఆయన కొనియాడారు. రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం ఐఎన్ఎస్ విక్రాంత్‌ను సందర్శించారు. ఐఎన్ఎస్ విక్రాంత్‌పై నిలబడి పాకిస్థాన్‌కు వార్నింగ్ ఇచ్చారు. కేంద్రమంత్రి రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ.. ' 1971లో భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం జరిగినప్పుడు భారత నేవీ కూడా యుద్ధంలో పాల్గొంది. భారత నేవీ దెబ్బకు పాక్ రెండుగా చీలిపోయింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నేవీ రంగంలోకి దిగి ఉంటే.. ఈసారి పాక్ నాలుగు ముక్కలు అయ్యేది. ఆపరేషన్ సిందూర్ సమయంలో నేవీ మౌనంగా తన పని చేసుకుపోయింది. ప్రతీ భారతీయుడ్ని ఆశ్చర్యపరిచింది. మౌనంగా ఉంటూనే .. పాక్ ఆర్మీని ఓడించటంలో విజయవంతం అయింది.

# లోకేష్ నలభై...పవన్ పాతిక...జగన్ ముప్పై !



అమరావతి,ఈ అంకెలేంటి ఈ లెక్కలేంటి అని అనుకుంటున్నారా. ఏమీ కంగారు పడాల్సింది లేదు. ఈ అంకెలు రాజకీయ గణిత శాస్త్రంలో కీలకమైనవి. మన నాయకులు వారి ఆకాంక్షలకు ప్రతిబింబాలుగా చూడాల్సి ఉంది. ఏపీలో చూస్తే ముగ్గురు భవిష్యత్తు నాయకుల లక్ష్యాలుగా కూడా వీటిని భావించాల్సి ఉంది.ఏపీలో సుదీర్ఘమైన రాజకీయ జీవితం అందుకున్న వారు చంద్రబాబు. ఆయన రాజకీయ జీవితం 2028 నాటికి అక్షరాలా యాభై ఏళ్ళు. బాబు మాదిరిగా అర్ధ శతాబ్ద రాజకీయం చేయాలని అందరికీ ఉంటుంది. ఆ తరువాత తరంలో చూస్తే ముగ్గురు నాయకులు దానికి తగిన ప్రాతిపదికను తయారు చేసుకుంటున్నారు. వారిలో ఒకాయన ఇప్పటికే ముఖమంత్రి అయ్యారు. ఆయనే జగన్. తన రాజకీయ జీవితం మరో ముప్పయ్యేళ్ళ పాటు కొనసాగిస్తాను అని జగన్ పార్టీ నాయకులకు పదే పదే చెబుతున్నారు.నాతో కలసి వచ్చే వారు పార్టీ కోసం నిబద్ధతో పనిచేయాలని ఆయన సూచిస్తున్నారు. తాను సుదీర్ఘమైన రాజకీయాన్ని చేస్తాను అని భరోసా ఇస్తున్నారు. ఈ మధ్యలో గెలుపు ఓటములు తనను ఏ మాత్రం ప్రభావితం చేయవని పార్టీ నేతలు కూడా కష్టాలు శాశ్వతం అనుకుని కృంగిపోకుండా ముందుకు అడుగులు వేయాలని జగన్ కోరుతున్నారు. సో జగన్ రాజకీయ జీవితం మరో మూడు దశాబ్దాలు అన్న మాట. అంటే 2055 దాకా జగన్ రాజకీయ రంగంలో క్రియాశీలంగా ఉంటాను అని చెబుతున్నారని అనుకోవాలి.ఇక టీడీపీకి ఫ్యూచర్ లీడర్, కాబోయే సీఎం గా అందరి చేత పిలిపించుకుంటున్న నారా లోకేష్ మరో నాలుగు దశాబ్దాల రాజకీయం చేస్తాను అని అంటున్నారు. మహానాడులో మూడు రోజుల పాటు జరిగిన కార్యక్రమం లో ఆయన స్పీచ్ వింటే అదే అర్థం అవుతుంది. మరో నాలుగు దశాబ్దాల పాటు టీడీపీని నిలబెడతామని శపథం చేస్తున్నారు. లోకేష్ వయసు ఇపుడు 42 ఏళ్ళు. ఆయన 82 ఏళ్ళ వయసు వచ్చేంతవరకూ తాను ఎత్తిన టీడీపీ జెండాను వదిలిపెట్టను అని అంటున్నారు. సో లోకేష్ భారీ టార్గెట్ నే సెట్ చేసుకున్నారన్న మాట.ఇక జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విషయం తీసుకుంటే పాతికేళ్ళ రాజకీయం అన్నది ఆయన స్లోగన్. ఆయన అసలైన రాజకీయం 2024 నుంచే స్టార్ట్ అయింది అని చెప్పుకోవాల్సి ఉంటుంది. అన్ని ఆశలు తీరి ఉప ముఖ్యమంత్రి వంటి కీలక పదవి ఆయనను వరించింది. దాంతో ఆయన ప్రజలకు చేయాల్సిన సాయం చేయగలుతున్నారు ఇక ఇదే ఊపుతో ఆయన మరిన్ని సార్లు కూటమి గెలవాలని బలంగా కోరుకుంటున్నారు. అంతే కాదు, పాతికేళ్ళ పాటు రాజకీయం చేయడం ద్వారా ఏపీ రూపురేఖలను మార్చాలని పవన్ తపన పడుతున్నారు.దాంతో పవన్ రాజకీయ లక్ష్యాలు 2050 దాకా విస్తరించి ఉన్నాయని అంటున్నారు. ఆనాటికి పవన్ వయసు కూడా ఎనభై పడిలో పడుతుందని అంటున్నారు. ఇక జగన్ కూడా మరో ముప్పయ్యేళ్ళు అంటే 80 ఏళ్ళ వయసు దాకా రాజకీయాల్లో చురుకుగా ఉండాలనే భావిస్తున్నారు అన్న మాట. లోకేష్ ది అదే రూట్. సో చంద్రబాబు తో సమానంగా ఎనభయ్యేళ్ళ వయసు తమకు వచ్చేవరకూ తామూ రాజకీయాలు చేస్తామని ఈ ముగ్గురు కీలక నేతలు గట్టిగానే చెబుతున్నారు. సో ఏపీ భవిష్యత్తు రాజకీయం అంతా వీరి చేతుల్లోనే ఉండబోంది అన్న మాట. సో వీరు ఏ వ్యూహాలతో ముందుకు సాగుతారు అన్నది తెలియాలంట్ వెయిట్ అండ్ సీ.

# నిజ్జర్ కేసు పక్కన పెట్టి.. భారత్‌తో స్నేహం కోరుతున్న కెనడా!



సెంట్రల్ డెస్క్:గత కొంతకాలంగా ఉద్రిక్తంగా మారిన భారత్–కెనడా సంబంధాలు ఇప్పుడు కొత్త మలుపు తిరుగుతున్నాయి. కెనడా నూతన విదేశాంగ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనితా ఆనంద్, భారత్‌తో సత్సంబంధాలను పునరుద్ధరించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ దిశగా ఇప్పటికే అనేక అడుగులు వేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. గత ఏడాది ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్‌సింగ్ నిజ్జర్ హత్య కేసుతో ఇరుదేశాల మధ్య దెబ్బతిన్న దౌత్య, వాణిజ్య సంబంధాలను తిరిగి గాడిన పెట్టేందుకు కెనడా చూపుతున్న ఆసక్తి, భవిష్యత్తులో సానుకూల పరిణామాలకు సంకేతంగా నిలుస్తోంది.విదేశాంగ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే, అనితా ఆనంద్ భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణలో ఇరుదేశాల మధ్య ఉన్న వివిధ దౌత్యపరమైన అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఢిల్లీతో సంబంధాలను మెరుగుపరుచుకోవడం కోసం తాము ఉత్సుకతతో ఉన్నామని, ఇందుకోసం ఒక్కో అడుగు ముందుకు వేస్తున్నామని అనితా ఆనంద్ ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలతో మంచి సంబంధాలను కొనసాగించాలనే తమ విధానంలో ఇది ఒక భాగమని ఆమె నొక్కి చెప్పారు.నిజ్జర్ హత్య కేసు గురించి అడిగినప్పుడు, అనితా ఆనంద్ “చట్టబద్ధమైన పాలన ఎప్పటికీ రాజీపడదు” అని పునరుద్ఘాటిం చారు. ఈ కేసుపై విచారణ కొనసాగుతుందని, అయితే అదే సమయంలో భారత్‌తో సంబంధాలను మెరుగుపరుచుకోవడంపై తమ దృష్టి ఉందని ఆమె స్పష్టం చేశారు. నిజ్జర్ హత్య కేసు నేపథ్యంలోనే కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు దారితీశాయి. అప్పట్లో భారత్ ఈ ఆరోపణలను ఖండించగా, దౌత్య మరియు వాణిజ్య సంబంధాలు క్షీణించాయి.కెనడాలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో మార్క్ కార్నీ నేతృత్వంలోని లిబరల్స్ పార్టీ భారీ ఆధిక్యంతో విజయం సాధించింది. కార్నీ గతంలోనే భారత్‌తో దెబ్బతిన్న సంబంధాలను తిరిగి పునరుద్ధరిస్తామని పలుమార్లు ప్రకటించారు. కెనడియన్లు వ్యక్తిగతంగా, ఆర్థికంగా, వ్యూహాత్మకంగా భారత్‌తో బలమైన సంబంధాలను కలిగి ఉంటారని ఆయన నొక్కి చెప్పారు. సంబంధాలు దెబ్బతినడానికి కారణమైన విభేదాలను పరిష్కరించడానికి తాము కృషి చేస్తామని కార్నీ హామీ ఇచ్చారు. దశాబ్దాల తరబడి మిత్ర దేశాలుగా ఉన్న భారత్, కెనడాల మధ్య సంబంధాలు తిరిగి మెరుగుపడేందుకు కార్నీ నాయకత్వం, అనితా ఆనంద్ దౌత్యపరమైన చొరవ దోహదపడతాయని విశ్లేషకులు భావిస్తు న్నారు.

# బీజేపీ అధ్యక్షుడి ఎంపికకు ఎందుకింత ఆలస్యం..

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పుపై సందిగ్ధత నెలకొంది. కమలం పార్టీ రాష్ట్ర కొత్త అధ్యక్షుడు ఎవరనే ప్రశ్న ఇప్పటికే అందరి మెదళ్లను తొలుస్తోంది. ఎవరికి బాధ్యతలు ఇస్తారనే అంశంపై పార్టీతో పాటు రాజకీయవర్గాల్లోనూ తీవ్ర ఆసక్తి నెలకొంది. రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలతో పాటు పార్టీలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకొని అధిష్టానం స్టేట్ చీఫ్ నియామక ప్రక్రియకు కొన్నాళ్ళు బ్రేక్ వేసే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. బ్రేక్ వేస్తారా..? లేక స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత సంస్థగత%శీ%గా అధ్యక్షుడిని ఎంపిక చేస్తారా..? అనే సస్పెన్స్ కొనసాగుతోంది.తెలంగాణలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ ఎన్నికలు ప్రస్తుత రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రికిషన్ రెడ్డి అధ్యక్షతనే జరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆయన్ను మార్చి కొత్త వారికి బాధ్యతలు ఇస్తే ఇబ్బందులు ఎదురువుతాయనే ఉద్దేశ్యంతో కిషన్ రెడ్డినే కంటిన్యూ చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కొత్త అధ్యక్షుడు వస్తే సమయం తక్కువగా ఉండి కార్యవర్గం సెట్ అయ్యేందుకు సమయం పట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో ఢిల్లీ పెద్దలు పార్టీలో ఎలాంటి మార్పులు చేసే అవకాశాలు లేవని తెలుస్తోంది..కాంగ్రెస్ బీసీ నాయకుడిని పీసీసీ చీఫ్ గా నియమించడంతో బీజేపీ సైతం బీసీకే ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తున్నప్పటికీ, బీజేపీ కొత్త ప్రెసిడెంట్ ఎవరు అవుతారనేది మాత్రం అంతుపట్టడం లేదు. స్థానిక సంస్థలఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఉన్న ఫలంగా అధ్యక్షుడి ఎంపిక జరిగితే ఆ ప్రభావం పార్టీ కార్యక్రమాలతో పాటు స్థానిక ఎన్నికల మీద ఏ విధంగా ప్రభావం చూపుతుందో అని అధిష్టానం ఆలోచిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పటికే కొత్త పాత నేతల మధ్య అంతర్గత వార్ కొనసాగుతున్న నేపథ్యంలో కొత్తగా వచ్చిన అధ్యక్షుడుకి రాష్ట్ర నాయకత్వంతో పాటు, పార్టీ క్యాడర్ సహాకరిస్తుందా..? అనే సందిగ్ధత నెలకొంది. అంతేకాదు ఒకవేళ స్థానిక ఎన్నికల్లో విఫలం అయితే ఆ ప్రభావం చివరి వరకు ఉంటుందనే ఆలోచనలో ఢిల్లీ పెద్దలు ఉన్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే రాబోయే కాలంలో వరసగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండటంతో అధ్యక్షుడి ఎంపిక ఆలస్యం అయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.ప్రస్తుతం కేంద్ర మంత్రి బాధ్యతలతో పాటు కిషన్ రెడ్డి పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి రాకపోయినా గతంతో పోలిస్తే మెరుగైన ఫలితాలు సాధించడంలో ఆయన సక్సెస్ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో సైతం 8 పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకోవడంలో కిషన్ రెడ్డి క్రియాశీలక పాత్ర పోషించారు. అయితే ఇటు స్టేట్ చీఫ్ గా, అటు కేంద్ర మంత్రిగా బాధ్యతలు ఉండటతో స్టేట్ చీఫ్ గా పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టలేకపోతున్నానని, తొందరగా అధ్యక్ష పీఠం నుంచి దిగిపోవాలని ఉందన్న అభిప్రాయాన్ని కిషన్ రెడ్డి పదేపదే వ్యక్తం చేస్తున్నారు. ఇన్సైడ్ మాత్రం కిషన్ రెడ్డి అధ్యక్ష పీఠం మీద ఇంకొకరుని కూర్చోకుండా చేస్తున్నారన్న విమర్శలు కిషన్‌రెడ్డి పై బలంగా వినిపిస్తున్నాయి. బయటకు



మాత్రమే నాకొద్దు ఈ అధ్యక్ష పదవి అంటారు. లోన మాత్రం చేసేది చేస్తున్నారని పార్టీ నేతలు చిర్రుబుర్రులాడుతున్నారు. ఈ మధ్యకాలంలోనే జమ్ము కాశ్మీం రాష్ట్ర పార్టీ బాధ్యతల నుంచి రిలీవ్ అవ్వడంతో ఇప్పుడిప్పుడే తెలంగాణ పార్టీ కార్యకలాపాలపై కిషన్ రెడ్డి ఫోకస్ పెడుతున్నారు. వరుసగా రివ్యూలు చేపడుతున్నారు. ఇటీవల ఆపరేషన్ సింధూర్, హైడ్రా, మూసీ ప్రక్షాళన అంశాలతో పాటు మెంబర్ షిప్ డ్రైవ్ పై ఆయన సమీక్ష నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో రాష్ట్రా వ్యాప్తంగా తిరంగ ర్యాలీలు చేస్తూ ప్రజలను బీజేపీ వైపుకు తిప్పు కునే ప్రయత్నం చేస్తున్నారు. ఇక ఆపరేషన్ సింధూర్ తిర%శీ%గ ర్యాలీల ఫార్ములా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫలితాలనిస్తుందా లేదా అనేది అటుంచితే..? పార్టీ అధ్యక్షుడి పీఠంపై పలువురు నేతలు గంపెడాశలతో ఉన్నారు. ఎవరికి వారు తమకే వస్తుందని ధీమాతో ఉన్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. స్థానిక సంస్థలు దగ్గర పడుతుండటంతో సంస్థగత ఎన్నికలు పెండిగులో పెట్టే అవకాశమైతే స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే బూత్ స్థాయి, మండల డివిజన్ స్థాయి, జిల్లా స్థాయి అధ్యక్ష ఎంపికలు పూర్తయ్యాయి. ఇక మిగిలింది స్టేట్ చీఫ్ ఎన్నిక మాత్రమే, ఈ నెలాఖరుకు అధ్యక్ష ఎన్నిక పూర్తి అవుతుందని పార్టీ వర్గాలు ఏడాది నుంచి చెప్పుకొస్తున్నప్పటికీ పరిస్థితులు చూస్తుంటే అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయిమొత్తమ్మీద తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి ఎంపిక రోజుకొక మలుపు తిరుగుతోంది. అధ్యక్షుడు ఎంపికలో ఎటు తేల్చుకోలేని పరిస్థితుల్లో అధిష్ఠానం ఉందనే చర్చ జరుగుతున్న తరుణంలో ఉగ్రదాడులు తెరమీదకు వచ్చాయి. ఆపరేషన్ సింధూర్‌తో అధ్యక్షుడి ఎంపిక వాయిదా పడింది. ఇక ఆపరేషన్ సింధూర్ చల్లబడింది రెపో మాపో అధ్యక్షుడిని ప్రకటిస్తారని అనుకుంటున్న నేపథ్యంలో కాళేశ్వరం కమిషన్ నోటీసుల పంచాయితీ తెరమీదకు రావడంతో ఇప్పట్లో రాష్ట్ర అధ్యక్ష పంచాయితీ లేనట్టే అంటున్నారు. కిషన్ రెడ్డి అనుకున్న రాజకీయమే బీజేపీలో నడుస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల వరకు కిషన్ రెడ్డే అధ్యక్షుడిగా కొనసాగే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. అంటే దాదాపు మరో మూడు నుంచి నాలుగు నెలలు సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. ఇక పార్టీ వర్గాల్లో ఉత్కంఠ రేపుతున్న అధ్యక్ష పదవిపై గంపెడాశలు పెట్టుకొని ఉన్న కాషాయ నేతలకు నిరాశే మిగలనుంది.

# నాగబాబుకు మంత్రి పదవి...క్లారిటీ వచ్చేసినట్లేనా !



హైదరాబాద్,మెగా బ్రదర్, జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు ఎమ్మెల్సీ. ఈ హోదా బాగానే ఉంది. హాయిగా పెద్దల సభలో ఆరేళ్ల పాటు ప్రాతినిధ్యం వహించవచ్చు. ప్రజా సమస్యలను పెద్దల సభలో ప్రస్తావించడం ద్వారా మంచి పేరు తెచ్చుకోవచ్చు. ఆరున్నర పదుల వయసులో ఉన్న నాగబాబుకు స్థాయికి తగిన పదవి ఇది. అయితే దీనితోనే ఆయనకు సరిపెడతారా. ఆయన స్తోమతకు ఇంతకు మించి సేవ చేసే చాన్స్ ఇస్తారా లేదా అన్నదే చర్చగా ఉంది.నిజానికి చూస్తే మెగా బ్రదర్ ని మంత్రి అని ఆరేడు నెలల క్రితమే అన్నారు. ఆ మాటలు ఏ ఊహాగానాలో ఎవరో చెప్పినవి అయితే కావు. ఏ గాసిప్స్ సైతం కానే కావు. ఏపీ ముఖ్యమంత్రి కూటమి పెద్దగా ఉన్న చంద్రబాబు ట్విట్టర్ ద్వారానే చాలా నెలల క్రితం ప్రకటించారు. నాగబాబుని తన కేబినెట్ లోకి తీసుకోబోతున్నట్లుగా ఆయన స్పష్టంగానే వెల్లడించారు.అయితే బాబు ప్రకటించిన నాటికి నాగబాబు ఏ చట్ట సభలో సభ్యుడు అయితే కారు, ఆయన కేవలం జనసేన నాయకుడు మాత్రమే. ఆ లోటుని తీరుస్తూ మార్చి నెలతో ఆయన ఎమ్మెల్సీ అయిపోయారు. ఆ మీదట మంచి రోజు చూసుకుని ప్రమాణం కూడా ఎమ్మెల్సీగా చేశారు. ఇక ఆయన ఎమ్మెల్సీ రెండు నెలలు పూర్తి అయింది కానీ మంత్రి పదవి అయితే కనుచూపు మేరలో కానరావడం లేదు అని అంటున్నారు.నిజానికి అప్పట్లో జరిగిన ప్రచారం బట్టి చూస్తే కనుక మార్చి 30న ఉగాది పండుగ వేళ నాగబాబు మంత్రి అవుతారు అని అంతా అనుకున్నారు. మధ్యలో ఏప్రిల్ 30, మే 30 కూడా పూర్తి అయి క్యాలెండర్ లో కాగితాలు చిరుగుతున్నాయి కానీ నాగబాబు మినిస్టర్ కాలేకపోతున్నారు. ఇక చూస్తే జూన్ నెల 12తో కూటమి ప్రభుత్వం తొలి ఏడాది పాలన పూర్తి చేసుకోబోతోంది.దాంతో పాటు అనేక కార్యక్రమాలను కూడా ప్రకటించనున్నారు. ఇక ఆ తరువాత జూన్ 22 నుంచి ఆషాడ మాసం వచ్చేస్తోంది. అంటే అది పూర్తిగా శూన్యమాసం అన్న మాట. మళ్ళీ శ్రావణ మాసంలో మంచి ముహూర్తాలు ఉంటే కానీ ఏ ముఖ్య కార్యక్రమం చేపట్టేందుకు వీలు పడదని అంటున్నారు. అయినా మంత్రి వర్గ విస్తరణ అన్న అజెండా ఉంటే ముహూర్తాలు కానీ లేకపోతే ఈ తాపత్రయాలు ఎందుకు అన్నది కూడా చర్చిస్తున్నారు.బొత్తిగా ఏడాదికే ఉన్న మంత్రులను తప్పించి కొత్తవారికి ఇవ్వాలన్న ఆలోచన అయితే కూటమి పెద్దలకు లేదు అని అంటున్నారు. కేవలం నాగబాబు కోసం రీషఫలింగ్ చేసినా చాలా మంది ఆశావహులు ముందుకు వస్తారని అలా చూస్తే కోరి తేనే తుట్టెను కదిపినట్లు అవుతుందని అంటున్నారు. దాంతో అన్నీ చూసుకుని సమయం సందర్భం వచ్చినపుడే మంత్రివర్గంలో మార్పులు చేర్పులూ అని అంటున్నారు.అంతవరకూ నో విస్తరణ నో మార్పులు అని కూడా అంటున్నారు సో నాగబాబుకు మంత్రి పదవి విషయంలో అయితే ఫుల్ క్లారిటీ వచ్చింది అని అంటున్నారు. ఇక జనసేనకు మూడు మంత్రి పదవులు ఇచ్చారు. బీజేపీ మరోటి కావాలని అంటోంది. టీడీపీలో ఆశావహులు చాలా మంది ఉన్నారు. అలా అందరినీ ఆశలలో తేలించడానికే కేబినెట్ లో ఒకే ఒక్క బెర్త్ ని అలా ఖాళీగా ఉంచేసారు అని అంటున్నారు. సో ఆ ఖాళీ అలాగే మరిన్నాళ్ళు కొనసాగుతూనే ఉంటుంది అన్నది తాజా కబురుగా ఉంది మరి.

# కమలంలో కారు విలీనం?.. తెర పైకి కొత్త చర్చ!

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో సంచలనంగా మారిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుట్ల కవిత మరో సంచలనానికి తెర తీశారు. బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేసే ప్రయత్నాలు జరుగున్నాయని మీడియా చిట్ చాట్ లో చెప్పారు. నిజానికి మై డియర్ డాడీ అంటూ కేసీఆర్ కు రాసిన, లేఖలోనూ కవిత, బీజేపీ, బీఆర్ఎస్ సంబంధాలని ప్రస్తావించారు. వరంగల్ రజతోత్సవ సభలో కేసీఆర్ బీజేపీ పట్ల కొంత మెతక వైఖరి అవలంబించారనే అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. బీజేపీని గట్టిగా తిట్టకపోతే.. బీజేపీ, బీఆర్ఎస్ కలుస్తాయనే తప్పుడుసంకేతాలు ప్రజల్లోకి వెళతాయని అంటూ.. కేసీఆర్ తమ ప్రసంగంలో కేవలం రెండు నిముషాలు మాత్రమే బీజేపీని టార్గెట్ చేయడాన్ని నెగటివ్ పాయింట్స్ లో చేర్చారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఏకంగా బీఆర్ఎస్ ను బీజేపీలో విలీనం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న కొత్త చర్చను తెర పైకి తెచ్చారు. అయితే.. కవిత లేఖలో పేర్కొన్న అంశాలలో కొంత నిజం ఉన్నా.. బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అనేది ఎలా చూసిన అయ్యే పని కాదని పరిశీలకులు అంటున్నారు. నిజానికి కేసీఆర్ బీఆర్ఎస్ ను బీజేపీలోనే కాదు, కాంగ్రెస్ సహా మరే పార్టీలోనూ విలీనం చేయరని.. ఒక్క ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన పార్టీ అస్తిత్వాన్ని చంపుకునే తప్పు కేసీఆర్ చేయరని ఆయన సన్నిహితులు అంటున్నారు. నిజానికి.. గతంలో ఉద్యమ సమయంలోనూ కేసీఆర్ తెలంగాణ సాధించుకునే వ్యూహంలో భాగంగానే కాంగ్రెస్ ముందు విలీనం ప్రతిపాదనను ఉంచారని.. ఒక పావుగా మాత్రమే విలీనం ప్రతిపాదన చేశారని కేసీఆర్ మాజీ మిత్రులు అంటున్నారు. అయితే.. బీఆర్ఎస్, బీజేపీతో పొత్తు పెట్టుకునే అవకాశాలను మాత్రం కొట్టి వేయలేమని మాజీ మిత్రులతో పాటుగా, ప్రస్తుత పరిణామాలను దగ్గరగా చూస్తున్న రాజకీయ విశ్లేషకులు సైతం భావిస్తున్నారు. నిజానికి.. ప్రస్తుత పరిస్థితిలో బీఆర్ఎస్, బీజేపీ ఎన్నికల పొత్తు ఉభయ తారకంగా రెండు పార్టీలకూ లాభ దాయకంగా ఉంటుందని రాజకీయ విశ్లేషకులతో పాటుగా ఉభయ పార్టీలలో ఒక వర్గం గట్టిగా భావిస్తోంది. అయితే.. అదే సమయంలో రెండు పార్టీలలోనూ కూడా పొత్తు వద్దనే వాదన కూడ అంతే బలంగా వినిపిస్తోందని అంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల ఫలితాలను, ఉభయ పార్టీల ఓటు షేర్ లో వస్తున్న మార్పును గమనిస్తే.. బీఆర్ఎస్, బీజేపీ ఓటు పరస్పరం బదిలీ అవుతున్న వైనం కనిపిస్తుందని విశ్లేషకులు అంటున్నారు. ఉదాహరణకు 2018 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను గమనిస్తే.. బీజేపీకి వచ్చిన ఓటు షేర్ జస్ట్ 7 శాతం. అసెంబ్లీలో కమలానికి దక్కింది ఒక్కటే సీటు.. కానీ, ఆతర్వాత కొద్ది నెలలకే జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీజేపీ ఓటు షేర్ ఏకంగా 20 శాతానికి పెరిగింది. ఆ మేరకు బీఆర్ఎస్ ఓటు షేర్ తగ్గింది. అలాగే.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 14 శాతం ఓట్లు 8 సీట్లు వచ్చాయి. కానీ.. 2024లోక్ సభ ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి బీజేపీ ఓటు షేర్ ఏకంగా



35 శాతానికి చేరింది. అసెంబ్లీ స్థానాలతో సమానంగా 8 లోక్ సభ స్థానాలు బీజేపీ గెలుచుకుంది. మరోవంక అసెంబ్లీ ఎన్నికల్లో 37 శాతం ఓటు షేర్ సొంతం చేసుకున్న బీఆర్ఎస్ ఓటు షేర్ లోక్ సభ ఎన్నికల్లో 17 శాతానికి పడిపోయింది. అంటే, అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసిన ఓటర్లలో 20 శాతం మంది లోక్ సభ ఎన్నికల్లో కమలానికి ఓటు వేశారు. ఇక్కడ గమనించవలసిన మరో ముఖ్య విషయం ఏమిటంటే అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఓటు షేర్ లో మార్పు అంతగా లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో 40 శాతం ఓటుతో 65 సీట్లు గెలుచుకున్న కాంగ్రెస్, అదే 40 శాతం ఓటుతో లోక్ సభ ఎన్నికలలో 8 సీట్లు తెచ్చుకుంది.సో.. కళ్ళ ముందున్న ఓటు షేర్ లెక్కలు. ఓటు ట్రాన్స్ఫర్ ప్యాట్రన్ ను గమనిస్తే.. బీఆర్ఎస్, బీజేపీ పొత్తు ఉభయతారకంగా ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు. అంతే కాకుండా, జాతీయ పార్టీగా బీజేపీకి లోక్ సభ ఎన్నికల్లో గెలుపు, కేంద్రంలో అధికారం కీలకం. అదే విధంగా ప్రాంతీయ పార్టీగా బీఆర్ఎస్ కు అసెంబ్లీ ఎన్నికలలో గెలుపు, రాష్టంలో అధికారం కీలకం అవుతుంది. సో.. పొత్తుకు ఉభయ పార్టీలు ఒకే చెప్పే అవకాశం ఉందని అంటున్నారు. అయితే.. నడుస్తున్న చరిత్రను గమనిస్తే, గడచిన పాతికేళ్ళ ప్రస్థానంలో బీఆర్ఎస్ కాంగ్రెస్, టీడీపీ, వామపక్షాలు సహా అన్ని పార్టీలతో పొత్తు పెట్టుకుంది. కానీ, బీజేపీతో మాత్రం ఏనాడూ పొత్తు పెట్టుకోలేదు. ఆ ఇంటి మీద కాకి ఈ ఇంటి మీద వాల లేదు. మరో వంక కాంగ్రెస్ తో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంది. కేంద్రంలో, రాష్టంలో సం కీర్ణ ప్రభుత్వాలలో కలిసి పనిచేసింది. ఉభయ పార్టీలూ చెట్టపట్టాల వేసుకుని పనిచేయడమే కాదు, ఎమ్మెల్యేలను ఇచ్చిపుచ్చుకోవడాల విషయంలో కూడా రెండు పార్టీల మధ్య అవగాహన ఉందని, బీఆర్ఎస్ తో పొత్తు వద్దకునే బీజేపీ నాయకులు చరిత్రను తిరగేస్తున్నారు. అలాగే, కమలంతో పొత్తు వద్దనుకునే బీఆర్ఎస్ నాయకులు, డీఎన్ఏలు కలవని బీజేపీతో పొత్తు వలన దీర్ఘ కాలంలో

# ఎన్డీయే నిర్ణయంపై కాంగ్రెస్ నేత ప్రశంసలు...



న్యూఢిల్లీ,ప్రస్తుతం బీజేపీ నిర్ణయాలను కొనియాడుతూ, ప్రపంచ వేదికలపై మోడీ సర్కార్ పై ప్రశంసలు కురిపిస్తున్నారంటూ కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ విషయం హాట్ టాపిక్ గా మారిన వేళ... జమ్మూకశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370 రద్దుపై కితాబిచ్చారు మరో కాంగ్రెస్ నేత. దీంతో.. ఇప్పుడు ఈయన వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది.అవును... ఎన్డీయే ప్రభుత్వ నిర్ణయాలను ఇప్పటికే శశిథరూర్ కొనియాడుతున్నారంటు కాంగ్రెస్ నేతలు మండిపడుతున్న వేళ.. ఆ పార్టీకి చెందిన మరో కీలక నేత, మాజీ విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్.. ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని కొనియాడారు. ఈ నిర్ణయం జమ్మూకశ్మీర్ లో ఎంతోకాలంగా ఉన్న వేర్పాటువాద సమస్యకు ముగింపు పలికిందని అన్నారు. ఈ సందర్భంగా... కశ్మీర్ కు చాలాకాలం ఒక పెద్ద సమస్య ఉండేదని.. ప్రత్యేక ప్రతిపత్తి కారణంగా అది దేశంలోని మిగిలిన ప్రాంతాలతో వేరు అనే భావన కలిగించేదని.. అయితే, ఆర్టికల్ 370ని రద్దు చేయడంతో ఆ వేరు అనే భావన అంతమైందని అన్నారు. ఇండోనేషియాలో థింక్ ట్యాంక్స్, విద్యాసంస్థల సభ్యులతో కలిసిన సమావేశంలో ఆయన ప్రసగిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ పై ఏర్పడిన అఖిలపక్ష బృందంలోని జనతాదల్ (యునైటెడ్) ఎంపీ సంజయ్ కుమార్ ఝా నేతృత్వంలో పర్యటిస్తున్న సల్మాన్ ఖుర్షీద్.. ఆర్టికల్ 370 తర్వాత జమ్మూకశ్మీర్ లో వాతావారణం పురోగతిని సాధించిందని.. తదుపరి జరిగిన ఎన్నికల్లో 65% ఓటర్లు పాల్గొన్నారని.. ఫలితంగా, కేంద్రపాలిత ప్రాంతంలో ఎన్నికైన ప్రభుత్వం ఏర్పడిందని పేర్కొన్నారు.కాగా... ఉగ్రవాదంపై పాకిస్థాన్ అనుసరిస్తున్న విధానాన్ని ఎండగట్టేందుకు భారత పార్లమెంటరీ అఖిలపక్ష ప్రతినిధుల బృందాలు పలు దేశాల్లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మోడీ సర్కార్ పై శశిథరూర్ అనుకూల వ్యాఖ్యలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇవి కాంగ్రెస్ పార్టీలో పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.ఈ సమయంలో ఇండోనేషియా, దక్షిణ కొరియా, మలేసియా, జపాన్, సింగపూర్ వంటి దేశాల్లో పర్యటిస్తోన్న బృందంలో సభ్యుడిగా ఉన్న సల్మాన్ ఖుర్షీద్ కూడా ఇప్పుడు మోడీ సర్కార్ తీసుకున్న నిర్ణయాలను కొనియాడటం సంచలనంగా మారింది.

Printed, Published & Owned by **MEDE SHANTHI KUMAR**, Printed at **SPOORTHI PRINTERS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From **SPOORTHI PUBLICATIONS**, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: **MEDE SHANTHI KUMAR.**